మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
గురువారం | 30 |జూలై | 2026 | పేజీలు: 15

## వైభవంగా ఆషాఢ పౌర్ణమి గిరి ప్రదక్షిణ



10 లో

# క్రీడలతో ఆరోగ్యం పదిలం






పి.మీరాహుస్సేన్ ఖాన్

క్రీడలు మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదం చేస్తాయి

ఉద్యోగులు ప్రతిరోజూ ఏదో ఒక క్రీడకు సమయం కేటాయించాలి

కలెక్టరేట్ ఇగ్నైట్ సెల్లో క్రీడా పరికరాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

-విజయవాడ, మనంబ్యూరో

12 లో



## గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించండి

5 లో

ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్.బేగ్

## ఈసీఐ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి

పట్టభద్రులు, ఉపాధ్యాయులు,స్థానిక సంస్థల నియోజకవర్గాల ఓటర్ల జాబితాల తయారీ పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



7 లో

## జిల్లాలో టూరిజం ప్రాజెక్టులు డీపీఆర్లకే పరిమితం కాకుండా గ్రౌండింగ్ కావాలి




11 లో

రూ.75 కోట్లతో ఏఎంసీ ఎంటర్టైన్మెంట్ ప్రాజెక్టును జూలై-2027 నాటికి అందుబాటులోకి తీసుకురావాలి

నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో 'విజయవాడ ఉత్సవ్' నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

పర్యాటక అభివృద్ధితో జిల్లా ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది

జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ

# అమరావతి ఛాంపియన్ షిప్ క్రీడల పోటీలు



మైలవరం జూలై 29 మనం న్యూస్: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నియోజకవర్గ స్థాయిలో అమరావతి ఛాంపియన్ షిప్ క్రీడల పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా అండర్ - 23 విభాగంలో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు బాస్కెట్ బాల్ , కబడ్డీ, ఖో-ఖో, వాలీ బాల్ , వెయిట్ లిఫ్టింగ్, చెస్ , అథ్లెటిక్స్ , బ్యాడ్మింటన్ వంటి వివిధ క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరిచి మరియు అన్ని విభాగాలలో జిల్లా స్థాయిలో ఎంపిక అయ్యారని కళాశాల వైస్ ప్రి న్సిపాల్ బి.రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిక అయిన విద్యార్థిని, విద్యార్థులను మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఎస్.దుర్గా రెడ్డి, ఎమ్. బేబీ రాణి, ఎస్.నటరాజ్ లను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బి.రమేష్ రెడ్డి మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# రెండేళ్లు పూర్తి చేసుకున్న ఒడిషా ఏఎం/ఎన్ఎస్ ఇండియా ఖోఖో హై పెర్ఫార్మెన్స్ సెంటర్



గాంధీనగర్, జూలై 29 మనం న్యూస్: ఒడిషాలోని పూరీ కేంద్రంగా పనిచేస్తున్న ఒడిషా ఏఎం/ఎన్ఎస్ ఇండియా ఖోఖో హై పెర్ఫార్మెన్స్ సెంటర్ (కెవీసీసీ) తన రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించడంతో పాటు, ఖోఖో ఎంపిక ట్రయల్స్-2026 ద్వారా కొత్త అథ్లెట్లను కేంద్రంలో చేర్చుకున్నారు. ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా), ఒడిషా ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం దేశంలో ఖోఖో క్రీడాభివృద్ధికి కీలక వేదికగా మారింది. గత రెండేళ్లలో ఈ కేంద్రానికి చెందిన క్రీడాకారులు ఖోఖో ప్రపంచకప్-2025, జాతీయ క్రీడలు, ఖేలో ఇండియా యూత్ గేమ్స్, జూనియర్, సీనియర్, సబ్జూనియర్ జాతీయ ఛాంపియన్షిప్లలో రాణించారు. మొత్తం 30కిపైగా జాతీయ, ప్రాంతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 48 పతకాలు సాధించడం విశేషం. వేడుకల్లో భారత పురుషుల ఖోఖో జట్టు కెప్టెన్ ప్రతీక్ వైకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏఎం/ఎన్ఎస్ ఇండియా, స్పోర్ట్స్ ఫర్ ఆల్ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఎంపిక ట్రయల్స్ అనంతరం 19 మంది కొత్త క్రీడాకారులకు కేంద్రంలో ప్రవేశం కల్పించగా, 31 మంది సీనియర్, జూనియర్ క్రీడాకారులు తమ స్థానాలను కొనసాగించారు. ఈ సందర్భంగా ఏఎం/ఎన్ఎస్ ఇండియా డైరెక్టర్ అషుతోష్ టెలాంగ్ మాట్లాడుతూ, ఖోఖోలో ప్రపంచస్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడమే కేంద్ర లక్ష్యమని తెలిపారు. క్రీడా నైపుణ్యంతో పాటు క్రమశిక్షణ, విద్యా ప్రతిభ, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ఈ కేంద్రం భారత ఖోఖోను అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా కృషి కొనసాగించనుంది.

# వీ ఫౌండేషన్. ఎరిక్సన్ ఆధ్వర్యంలో రోబోత్సవ్

గాంధీనగర్ జూలై 29 మనం న్యూస్: విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించి, సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించేందుకు వీ ఫౌండేషన్, ఎరిక్సన్ సంస్థలు సంయుక్తంగా 'రోబోత్సవ్' (సాంకేతిక ఉత్సవం) పేరుతో దేశవ్యాప్త అంతర్పాఠశాల రోబోటిక్స్ వేదికను ప్రారంభించాయి. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ భాగస్వామిగా మోయినీ ఫౌండేషన్ వ్యవహరిస్తుండగా, విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రోబోత్సవ్ డాట్ ఆర్గ్ వెబ్సైట్ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ డిజిటల్ వేదిక ద్వారా దేశవ్యాప్తంగా విద్యార్థులకు రోబోటిక్స్, త్రిమితీయ ముద్రణ (3డీ ప్రింటింగ్), కంప్యూటర్ ప్రోగ్రామింగ్, వర్చువల్ రియాలిటీ, ఉత్పాదక కృత్రిమ మేధ (జెనరేటివ్ ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతిక రంగాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించనున్నారు. అలాగే క్విజ్, వ్యాసరచన పోటీలు, సాంకేతిక అంశాలపై అభ్యాస పాఠాలు, బ్లాగుల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుంది. త్వరలో ఆఫ్లైన్ పోటీలను కూడా నిర్వహించి, విద్యార్థులకు తమ నైపుణ్యాలను ప్రదర్శించే వేదిక కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు రోబోటిక్స్, కృత్రిమ మేధ విద్యను చేరువ చేసి, డిజిటల్ ఇండియా లక్ష్య సాధనకు తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వీ ఫౌండేషన్ డైరెక్టర్ అంబికా ఖురానా తెలిపారు. భావితరం సాంకేతిక ఆవిష్కర్తలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎరిక్సన్ ఇండియా సుస్థిరాభివృద్ధి, కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగం అధిపతి సహర్ష్ సైమన్ డేవిడ్ పేర్కొన్నారు. ఇప్పటికే దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన 20 రోబోటిక్స్ ప్రయోగశాలల ద్వారా దాదాపు 10 వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు.

# బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యం పై దాడి చేస్తుంది

## సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్



మైలవరం జూలై 29 మనం న్యూస్: కేంద్ర ప్రభుత్వం ప్రజా స్వామ్యం పై దాడి చేస్తుందని ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకు లను అక్రమంగా అరెస్టు చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు రావూరి రమేష్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయం నుండి పంచాయతీ కూడలి వరకు ర్యాలీగా నిర్వహించి పంచాయతీ సెంటర్లో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఢిల్లీలో పోలీసు సిపిఎం కేంద్ర కార్యాలయం లోకి అక్రమంగా ప్రవేశించి ఎటువంటి పర్మిషన్ లేకుండా యూనిఫాం లేకుండా విద్యార్థి సంఘ నాయకురాలుగా ఉన్న ఐష్ ఘోషను అరెస్ట్ చేసేందుకు కుట్ర పూరితంగా వ్యవహరించడం దారుణ మైన చర్యని వారు అన్నారు. ఒక జాతీయ పార్టీ కార్యాలయం లోకి అక్రమంగా చొరబడటం ప్రజాస్వామ్యం పై దాడిని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బిజెపి ప్రభుత్వం ప్రశ్నించిన వారినీ అనగదొక్కాలని కుట్రపన్ని కేసులు బనాయించి, ఉద్యమాలు అనిచేందుకు చూస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దుర్మార్గ మైన చర్యలను యావత్తు ప్రజానీకం ఖండించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పూనుకుంటే మూల్యం చెల్లించక తప్పదని వాళ్ళు హెచ్చరించారు. సిపిఎం కేంద్ర కార్యాలయంలో సిపిఎం ఎంపీ జాన్ బిట్రస్ లేకుంటే ఈ అరాచకత్వం మరింత పెరిగేదని ఎంపీ అక్కడ ఉండటం వల్లే పోలీసులు వెనతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. నిజంగా వాళ్ళు పోలీసుల లేదా ఎవరైనా ఆర్ఎస్ఎస్ గుండాల, పూర్తిగా ఎంక్వయిరీ చేయాల్సిన బాధ్యత కూడా ఢిల్లీ పోలీసులపై ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు పద్ధతులు మానుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి ఉద్యమంలో పాల్గొని లక్షలాదిమంది విద్యార్థులు మేలు కోసం చేసినటువంటి నాయకులు అరెస్టు చేస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు రావుల సుబ్బారావు, ఎస్ ఇసాక్, ఎస్ పౌలు, లంక వెంకటేశ్వరరావు, గురుజాల రామారావు, దేవేంద్రనాథ్, రాజారెడ్డి, సుబ్బారెడ్డి, సురేష్, ఎం శ్రీనివాసరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓల్ స్టూడెంట్స్ ట్రస్ట్ (మోస్ట్) సౌజన్యంతో నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పొందిన వారి సామజిక సేవా కార్య క్రమాలు



మైలవరం జూలై 29 మనం న్యూస్: స్థానిక లీలావతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన, సాయిబాబా గుడి వద్ద అన్న సంతర్పణ లో వాలంటరీ సేవా కార్యక్రమమును కొనసాగిస్తున్న స్థానిక లకిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పునరుద్ధరణ లో భాగంగా ఎన్ ఎస్ ఎస్ యూనిట్, ఆధ్వర్యంలో ఓల్ స్టూడెంట్స్ ట్రస్ట్ (మోస్ట్) సౌజన్యంతో లీలావతి పబ్లిక్ స్కూల్ లో; చదువు కొంటున్న విద్యార్థిని విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ, సైబర్ మోసాలకు గురికాకుండా వుండటం, రోడ్డు భద్రత, మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి, చదువుపై ఏకాగ్రత కలిగి ఉండటం పై నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో అవగాహనా కార్యక్రమము నిర్వహించి నట్లు మరియు గుర్రాజు పాలెం రోడ్ దగ్గర ఉన్న సాయిబాబా గుడి లో గురుపూర్ణిమ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమములో కూడా పాల్గొని భక్తులకు అన్నసంతర్పణ చేసినట్లు నార్త్ సౌత్ ఫౌండేషన్ స్కాలర్షిప్ కోఆర్డినేటర్ గూడూరు నాగి రెడ్డి తెలియజేసారు. నార్త్ సౌత్ ఫౌండేషన్ హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్ వారి ఆదేశాల మేరకు ఉపకార వేతనాలు పునరుద్ధరణ పొందడానికి విద్యార్థిని విద్యార్థులు సంవత్సరం లో 50 గంటలకు పైగా సామాజిక సేవ కార్యక్రమాలు చేసి ధ్రువపత్రం పొందిఉండాలి. ఓల్ స్టూడెంట్స్ ట్రస్ట్ (మోస్ట్) వారి సౌజన్యంతో ఈ సంవత్సరం ఉపకార వేతనాలు పునరుద్ధరణ పొందడానికి ఎన్ ఎస్ ఎస్ యూనిట్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వ హించామని తెలిపారు. ఉపకార వేతనాలు పొందిన వారు బాగా చదువు కోవడంతోపాటు సమాజానికి తమవంతు సహాయం అందించాలని ఎన్ ఎస్ ఎస్ యూనిట్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.ఉమా మహేశ్వర రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఓల్ స్టూడెంట్స్ ట్రస్ట్ (మోస్ట్) సభ్యులు, లీలావతి పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు ఉడతా లక్ష్మీ నారాయణ, నార్త్ సౌత్ ఫౌండేషన్ స్కాలర్షిప్ కోఆర్డినేటర్ గూడూరు నాగి రెడ్డి, ఎన్ ఎస్ ఎస్ అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.ఉమా మహేశ్వర రెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు, మరియు నార్త్ సౌత్ ఫౌండేషన్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రూ.300 కోట్ల పెట్టుబడితో గోద్రెజ్ అగ్రోవెట్ భారీ ప్రాజెక్టు



గాంధీనగర్ జూలై 29 మనం న్యూస్: దేశంలోనే అతిపెద్ద వ్యవసాయ ఆధారిత సంస్థల్లో ఒకటైన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో దేశంలోనే తొలి సమగ్ర (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ కాంప్లెక్స్ను ప్రారంభించింది. విత్తనం నుంచి రిఫైనరీ వరకు ఆయిల్ పామ్ ఉత్పత్తికి అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టులో కంపెనీ మొత్తం పెట్టుబడి రూ.300 కోట్లకు చేరనుంది. ఈ కాంప్లెక్స్ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించగా, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్బాబు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ ఆయిల్ పామ్ మిషన్ విజయానికి ఈ కాంప్లెక్స్ కీలక మైలురాయిగా నిలుస్తుందని, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి వంటనూనె ఉత్పత్తిదారుగా తీర్చిదిద్దడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ ప్రాంగణంలో విత్తన తోట, జన్యుశాస్త్ర కేంద్రం, పరిశోధన-అభివృద్ధి కేంద్రం, నర్సరీ, ప్రాసెసింగ్ మిల్లు, త్వరలో ఏర్పాటు కానున్న ఆధునిక రిఫైనరీతో పాటు రైతులకు సాంకేతిక సేవలు అందించే సమాధాన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. గంటకు 30 టన్నుల సామర్థ్యంతో ప్రారంభమైన మిల్లును భవిష్యత్తులో 60 టన్నులకు విస్తరించనున్నారు. 2030 నాటికి ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని 30 వేల హెక్టార్లకు పెంచే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని గోద్రెజ్ అగ్రోవెట్ ఎండీ, సీఈఓ సునీల్ కటారియా తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు దేశ వంటనూనెల స్వయం సమృద్ధికి ఈ సమగ్ర కాంప్లెక్స్ కీలకంగా నిలుస్తుందని కంపెనీ పేర్కొంది.

# బలుసు పాడు గురు ధామ్‌లో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

జగ్గయ్యపేట, జూలై 29: మనం న్యూస్ః గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జగ్గయ్యపేట మండలం, బలుసుపాడు గ్రామంలోని గురుధామ్లో శివశ్రీ గంటేల వెంకటరమణ గురు దేవుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య , వారి కుమారుడు శ్రీరాం కృష్ణ పవన్ తో కలిసి వెంకటరమణ గురుదేవులనుదర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువుల సేవలను స్మరించుకోవడం భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైన సంప్రదాయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు. సమాజానికి మార్గదర్శకులైన గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.



# సదాశివ బ్రహ్మేంద్ర ఆశ్రమంలో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



**స్వామి రామానంద సరస్వతి వారిని దర్శించి ఆశీస్సులు పొందిన ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను**

జగ్గయ్యపేట, జూలై 29: మనం న్యూస్ః మండలంలోని చిల్లకల్లు సమీపంలో ఉన్న శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర ఆశ్రమంలో గురు పౌర్ణమి పర్వదిన మహోత్సవాలు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రామానంద సరస్వతి స్వామి వారి దివ్య దిశానిర్దేశంలో శిష్యులు, భక్తజనం నడుమ అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో నిర్వహించబడ్డాయి. ఈ పావన వేడుకలలో మాజీ ప్రభుత్వ విప్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని, ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి రామానంద సరస్వతి స్వామి వారిని దర్శించుకుని, వేద మంత్రోచ్చారణల నడుమ వారి దివ్య ఆశీస్సులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రామానంద సరస్వతి స్వామి వారు భక్తులను ఉద్దేశించి దివ్య అనుగ్రహ భాషణం చేశారు. 'అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానమనే దివ్య జ్యోతిని వెలిగించే మహోన్నత శక్తి ఒక్క గురువుకే సాధ్యమన్నారు. మానవ జన్మ లభించడమే ఒక గొప్ప వరమైతే, ఆ జన్మను సన్మార్గంలో నడిపించే సద్గురువు లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు. భగవంతుని కృప, గురువు యొక్క అనుగ్రహం ఎల్లప్పుడూ సత్ప్రవర్తన, ధర్మనిష్ఠ కలిగిన సత్పురుషులపైనే ఉంటాయన్నారు. సమాజంలో భక్తి, శాంతి, సోదరభావం వర్ధిల్లాలని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో కూడిన సన్మార్గంలో పయనించాలని హితవు పలికారు. గురు పౌర్ణమి పావన ఘడియలలో గురుదేవుల ఆధ్యాత్మిక బోధనలను స్మరించుకుంటూ, ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడమే నిజమైన గురుదక్షిణని పేర్కొన్నారు. వేడుకల అనంతరం ఆశ్రమానికి విచ్చేసిన భక్తులందరూ స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిదులు కృష్ణారావు, రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది జగన్నాధ రావు పట్టణ ప్రముఖులు శ్రీరామ్ రామకృష్ణ, వైస్ చైర్మెన్ తుమ్మల ప్రభాకర్, ఆశ్రమ అర్చకులు తేజ, మేనేజర్ రామశేషు, మస్తాన్, ఆశ్రమ సభ్యులు, శిష్య బృందం మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పదవులు బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపు**



జగ్గయ్యపేట జూలై 29 మనం న్యూస్ః వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో లభించిన పదవులను గౌరవంగా భావించి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు, వత్సవాయి మండలం వత్సవాయి గ్రామంలోని వాసవి కళ్యాణ మండపంలో బుధవారం జిల్లాస్థాయిలో వివిధ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులకు మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీలో పదవులు పొందిన నేతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు మరింత చేరువై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలో ఐక్యతే బలమని, వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా అందరూ ఒకే నాయకత్వంలో సమష్టిగా పనిచేస్తే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, పదవి అనేది గౌరవంతో పాటు మరింత బాధ్యతను పెంచేదేనని అన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన ఆయన, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి అవినీతికి ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. నియోజకవర్గంలో రోడ్లు, మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సహజ వనరుల దోపిడీ, అవినీతి పాలనపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల నాయకులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్కు తొలి త్రైమాసికంలో రూ.386 కోట్ల లాభం

గాంధీనగర్, జూలై 29 మనం న్యూస్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) పన్ను అనంతర లాభాన్ని గత ఏడాదితో పోలిస్తే 27.8 శాతం పెంచుకుని రూ.386 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. ఇదే కాలంలో పాలసీదారులకు మరణ క్లెయిమ్లు, మెచ్యూరిటీ, సర్వైవల్ బెనిఫిట్స్ రూపంలో మొత్తం రూ.4,666 కోట్లను చెల్లించినట్లు వెల్లడించింది. ఇందులో రూ.1,306 కోట్లు మరణ క్లెయిమ్లుగా, రూ.3,360 కోట్లు మెచ్యూరిటీ, సర్వైవల్ బెనిఫిట్స్గా చెల్లించినట్లు సంస్థ తెలిపింది. తొలి త్రైమాసికంలో కంపెనీ రిటైల్ టర్మ్ ప్లాన్ (ప్రొటెక్షన్) వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే 60.4 శాతం వృద్ధి సాధించగా, పరిశ్రమలోనే అత్యుత్తమంగా 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తిని నమోదు చేసింది. దర్యాప్తు అవసరం లేని క్లెయిమ్లను కేవలం ఒక రోజులోనే పరిష్కరిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ, సీఈఓ అనూప్ బాగ్చి మాట్లాడుతూ, వినియోగదారులకు అత్యవసర సమయంలో వేగవంతమైన ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సేవలను మరింత విస్తరించి వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. అలాగే, సంబంధిత నియంత్రణ సంస్థల ఆమోదం అనంతరం కంపెనీ పేరును 'ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్'గా మార్చేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. భారత జీవిత బీమా రంగంలో విస్తరిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సంస్థ వృద్ధి పథంలో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# అజ్ఞానమని చీకటిని తొలగించే శక్తి గురువు

**గురువర్యులు బ్రహ్మశ్రీ చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి నీ పూజించిన శిష్య బృందం**



జగ్గయ్యపేట జులై 29 మనం న్యూస్ః అజ్ఞానమనే చీకటిని తొలగించే శక్తి గురువు అని, గురువు అనుగ్రహం లేనిదే ఇహలోకంలో నైనా పరలోకంలో నైనా సుఖం పొందటం దుర్లభం అని బ్రహ్మశ్రీ చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి అనుగ్రభాషణ చేశారు.జగ్గయ్యపేట పట్టణంలో గురు పౌర్ణమి సందర్భంగా గురుదేవులు చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి బ్రాహ్మణ బజార్లోని తన నివాసంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అజ్ఞానమనే చీకటిని తొలిగించే శక్తే గురువు అని. నాలుగు వేదాలు, ఉపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, బ్రహ్మ సూత్రాలు, మహాభారతం, భాగవతం.. మానవాళికి అందించిన మహోన్నతుడు జ్ఞాన బ్రహ్మ వ్యాస మహాముని జన్మదినమే గురు పూర్ణిమ గా గురువును పూజించు కుంటున్నామని చిట్టా లక్ష్మి నరసింహశాస్త్రి అన్నారు. గురువు అనుగ్రహం లేనిదే ఇహలోకం లోనైనా పరలోకం లోనైనా సుఖం పొందడం దుర్లభం అని శాస్త్రం బోధిస్తోంది అన్నారు. సనాతన వైదిక ధర్మానికి ఇది ఒక మహాపర్వదినం అని, ప్రకృతి ధర్మానుసారం జరిగే చాతుర్మాస దీక్షలో యతులు, పీఠాధిపతులు ఎక్కడ కీ వెళ్లకుండా ఒకేచోట ఉండి జ్ఞాన బోధన చేస్తుంటారు అని తెలిపారు. ఈ దీక్ష సమయంలో వచ్చే మొదటి పౌర్ణమి గురు పౌర్ణమి అని ఈ సందర్భంగా జ్ఞాన సమపార్థనకు తమకు సమీపంగా నివసిస్తున్న తపస్సంపన్నులను దర్శించుకొని పూజించి జ్ఞానాన్ని సాధించే ఆచారానికి గురుపౌర్ణమి భూమికగా నిలుస్తుందని గురుదేవులు భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా గురు వర్యులకు శిష్య బృందం గురుపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు శ్రీరాం రామకృష్ణ, ఏలూరి రాంబాబు, దేవరకొండ శ్రీనివాసరావు, తదితర శిష్య బృందం సభ్యులు పాల్గొన్నారు. వారికి గురుదేవులు తీర్థప్రసాదాలు వితరణ చేసి భక్తులకు ఆశీర్వచనం చేశారు.

# 3వ 10వ సచివాలయాల పరిధిలో పారిశుధ్య ఫిర్యాదులపై కమిషనర్ ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు



జగ్గయ్యపేట జులై 29 మనం న్యూస్ః జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలోని 3వ మరియు 10వ సచివాలయాల్లో పారిశుధ్యానికి సంబంధించిన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ కమిషనర్ పి.వి.డి. ప్రసాద్ , శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు వెల్లడించిన పారిశుధ్య సమస్యలు, కాలువలపై బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్స్, కంకర్,ఇసుక తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ ప్రసాద్, భవన నిర్మాణ సామాగ్రి రోడ్డు అడ్డంగా ఉండకుండా, కాలువల పైన ఉండకుండా వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం జగ్గయ్యపేట పురపాలక సంఘం ప్రధాన లక్ష్యమని కమిషనర్ పి.వి.డి. ప్రసాద్ పేర్కొన్నారు. అదేవిధంగా, పారిశుధ్య పరిరక్షణలో ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా సహకరించాలని, చెత్తను నిర్దేశిత చెత్త సేకరణ కేంద్రాల్లో మాత్రమే వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛమైన పట్టణ నిర్మాణానికి తోడ్పడాలని కమిషనర్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధిత వస్తువులపై షాపుల్లో తనిఖీలు చేపట్టిన మున్సిపల్ అధికారులు




**జగ్గయ్యపేట జూలై 29 మనం న్యూస్ :** ప్లాస్టిక్ సంబంధిత నిషేధ వస్తువుల అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాపుల యజమానులను మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ పి.వి.డి. ప్రసాద్ మౌఖిక ఆదేశాల మేరకు, శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు బుధవారం జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలోని వివిధ దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కసారి వాడి పారేసే నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి, సంబంధిత షాప్ యజమానులకు జరిమానాలు విధించి, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, షాప్ యజమానులు తప్పనిసరిగా 120 మైక్రాన్లు లేదా అంతకంటే ఎక్కువ మందం కలిగిన క్యారీ బ్యాగులను మాత్రమే విక్రయించాలని, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలైన పేపర్ ప్లేట్లు, పేపర్ గ్లాసులు మరియు ఇతర పర్యావరణ అనుకూల ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని అధికారులు సూచించారు. భవిష్యత్తులో కూడా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే వారిపై నిరంతరం తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. ప్రజలు మరియు వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను పాటించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# వేలేరులో 'ప్రాజెక్ట్ రక్ష'

▸▸ **ఉచిత సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం**

**హనుమాన్ జంక్షన్: జూలై 30 ( మనం న్యూస్ ):** మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సెర్వికల్ క్యాన్సర్) ముందస్తు గుర్తింపు మరియు అవగాహన కోసం రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ,డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంయుక్త నిర్వహణలో వేలేరు రూరల్ హెల్త్ సెంటర్ నందు ప్రతిష్టాత్మక 'ప్రాజెక్ట్ రక్ష' (ౖటబ్ఛ్ౖభ ఖ్బిజుటజ్బి ఇౖర్ఘుఇ) ఉచిత సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రోటరీ క్లబ్ నాయకులు మరియు వైద్య నిపుణులు కలసి లాంఛనంగా ప్రారంభించారు.వేలేరు మరియు పరిసర గ్రామాల నుండి విచ్చేసిన దాదాపు 200 మందికి పైగా ప్రజలకు/మహిళలకు ఉచితంగా సెర్వికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు మరియు వైద్య సలహాలు అందించారు.

### ముఖ్య అతిథులు వైద్య నిపుణుల భాగస్వామ్యం:

ఈ కార్యక్రమంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్ , పాథాలజీ విభాగానికి చెందిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ,రూరల్ హెల్త్ సెంటర్ ఇన్చార్జ్ డాక్టర్ ప్రియ,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కళ్యాణ్, మరియు డాక్టర్ సుహాసిని పాల్గొని ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు.అలాగే వేలేరు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేములపల్లి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని, గ్రామీణ మహిళలకు ఉపయోగపడేలా ఇటువంటి క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించినందుకు రోటరీ క్లబ్ను అభినందించారు. ఈ వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ప్రతినిధులు అధ్యక్షులు రోటేరియన్ ఎస్. రవిప్రకాష్, కార్యదర్శి: రోటేరియన్ ఉప్పలపాటి రామకృష్ణ (రామ్కీ) కోశాధికారి: రోటేరియన్ జి. భానుప్రకాష్, డైరెక్టర్లు: రోటేరియన్ ఎ. శ్రీనివాస్,రోటేరియన్ తోట సిల్వెస్టర్, గ్రామీణ ప్రాంత మహిళల్లో సెర్వికల్ క్యాన్సర్ను ప్రారంభ దశలోనే గుర్తించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే 'ప్రాజెక్ట్ రక్ష' ముఖ్య ఉద్దేశమని, భవిష్యత్తులో కూడా మరిన్ని ఆరోగ్య సేవలు అందిస్తామని రోటరీ ప్రతినిధులు తెలిపారు.




# శ్వాసకోశ చికిత్సల్లో సరికొత్త శకం..

▸▸ **యశోద హైటెక్ సిటీ అరుదైన రికార్డులు**

▸▸ **అత్యాధునిక రోబోటిక్ సర్జరీలు, కృత్రిమ మేధతో శ్వాసకోశ వ్యాధులకు చెక్**

▸▸ **దేశంలోనే తొలి లంగ్ నొడ్యూల్ క్లినిక్ ఏర్పాటు.. సింగిల్ పోర్ట్ సర్జరీలతో ప్రాణదానం**

▸▸ **ఊపిరితిత్తుల మార్పిడిలో అద్భుత విజయాలు సాధిస్తున్న వైద్య నిపుణుల బృందం**




**గాంధీనగర్ జూలై 29 మనం న్యూస్ :** పెరుగుతున్న కాలుష్యం, రద్దీ వాతావరణం కారణంగా ఆస్తమా, క్షయ, సీఓపీడీ, నిమోనియా, క్యాన్సర్ లాంటి శ్వాసకోశ వ్యాధులు తీవ్రమవుతున్న ప్రస్తుత తరుణంలో.. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ సరికొత్త సాంకేతికతలతో రోగులకు వరదాయినిగా మారుతోంది. డాక్టర్ నాగార్జున మాటూరు నేతృత్వంలోని పల్మనాలజీ విభాగం ఈ వ్యాధుల గుర్తింపు, చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. నావిగేషనల్ బ్రాంకోస్కోపీ, కోన్ బీమ్ సీటీ గైడెడ్ బయాప్సీ, ఆర్కిమెడిస్ నావిగేషన్ సిస్టమ్స్, బయోడిగ్రేడబుల్ స్టెంట్స్ వంటి అధునాతన విధానాల ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే కచ్చితంగా గుర్తిస్తున్నామని డాక్టర్ జె.వి.ఎస్. అశ్విత్ చౌదరి వివరించారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ను తొలిదశలోనే గుర్తించి నయం చేసేందుకు దేశంలోనే మొట్టమొదటి 'లంగ్ నొడ్యూల్ క్లినిక్'ను యశోద ఆసుపత్రిలో ప్రారంభించారు. అలాగే ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్డీ), లంగ్ నొడ్యూల్స్ వంటి సమస్యలను మరింత కచ్చితత్వంతో పసిగట్టేందుకు క్యూర్.ఏఐ (ఖఱ్ప్ఛ.ౖజీ), ఇంజియో (ఐర్ఘుఛజీౌ) వంటి కృత్రిమ మేధ (ఏఐ) పరిజ్ఞానాన్ని ఈ విభాగం విస్తృతంగా వినియోగిస్తోంది. శస్త్రచికిత్సల విభాగంలోనూ యశోద హైటెక్ సిటీ యూనిట్ సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతోంది. కన్సల్టెంట్ లంగ్ ట్రాన్స్ప్లాంట్ మరియు మినిమల్లీ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ బాలే అత్యంత క్లిష్టమైన సర్జరీలను సునాయాసంగా చేస్తున్నారు. 2023లో దేశంలోనే తొలి సింగిల్ పోర్ట్ రోబోటిక్ థొరాసిక్ సర్జరీని, అలాగే ఇటీవల దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా సింపతెటిక్ ట్రంక్ రీకన్స్ట్రక్షన్ శస్త్రచికిత్సను డాక్టర్ మంజునాథ్ బాలే విజయవంతంగా నిర్వహించారు. వ్యాట్స్ (వీడియో-అసిస్టెడ్ థొరాకోస్కోపిక్ సర్జరీ), రోబోటిక్ విధానాల ద్వారా పక్కటెముకలు విరగ్గొట్టాల్సిన పనిలేకుండా.. కేవలం చిన్న కోతలతో సర్జరీలు చేస్తున్నారు. దీనివల్ల శస్త్రచికిత్స తర్వాత నొప్పి చాలా తక్కువగా ఉండటంతో పాటు, రోగులు కేవలం నాలుగు నుంచి ఏడు రోజుల్లోనే కోలుకుని తమ సాధారణ పనులకు హాజరవుతున్నారు. ఈ ఆధునిక పద్ధతుల ద్వారా టీబీ కావిటీ, డ్యామేజ్ అయిన ఊపిరితిత్తులు, ఫంగల్ బాల్, క్యాన్సర్, ఛాతీలో గాలి చేరడం (న్యూమోథొరాక్స్), నీరు లేదా చీము చేరడం (ఎంపైమా, ప్లూరల్ ఎఫ్యూజన్) వంటి సంక్లిష్ట సమస్యలకు సురక్షితమైన చికిత్సలు అందిస్తున్నారు. నిరంతరం ఆక్సిజన్ పైనే ఆధారపడి జీవించే ఐఎల్డీ, సీఓపీడీ, బ్రాంకియాక్టాసిస్ బాధితులకు ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్ప్లాంట్) ద్వారా యశోద వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. పారాక్వాట్ పాయిజనింగ్ బాధితుడికి దేశంలోనే తొలిసారిగా విజయవంతంగా ఊపిరితిత్తుల మార్పిడి చేసిన బృందంలో డాక్టర్ మంజునాథ్ బాలే కీలక పాత్ర పోషించడం విశేషం. బ్రెయిన్ డెడ్ దాతల నుంచి సేకరించిన అవయవాలతో అత్యంత సంక్లిష్టమైన ఈ మార్పిడి ప్రక్రియలను విజయవంతంగా నిర్వహిస్తూ, శ్వాసకోశ వైద్యరంగంలో యశోద హైటెక్ సిటీ హాస్పిటల్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ప్రజల్లో ఈ ఆధునిక చికిత్సలు, లంగ్ ట్రాన్స్ప్లాంటేష్ప విస్తృత అవగాహన కల్పించేందుకు యశోద హైటెక్ సిటీ ఆసుపత్రిలో ప్రత్యేక ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ అశ్విత్ చౌదరితో పాటు సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ నాగార్జున, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆర్. శ్యామ్ కృష్ణ సాయి పాల్గొని పై వివరాలను పత్రికా ముఖంగా వెల్లడించారు.

# మెగా డీఎస్సీ పై అభండాలు వేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

▸▸ **యువత భవిష్యత్తుతో జగన్మోహన్ రెడ్డి అండ్ కో కంపెనీ ఆటలు**

▸▸ **గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగాల్లో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారు**

▸▸ **నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు**

▸▸ **ధైర్యముంటే వచ్చే అసెంబ్లీ సమావేశాలకు రావాలి**

▸▸ **తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు వీరంకి వీరాస్వామి**



**నందిగామ,జులై29(మనం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం నందిగామ మండలం కంచల గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల సంక్షేమ విజయాలు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం ప్రచారంలో భాగంగా పత్రిక విలేకరుల సోదరులతో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి వీరంకి వీరాస్వామి మాట్లాడుతూ.పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీ పై అభండాలు వేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని గౌరవ మంత్రి శ్రీ నారా లోకేష్ బాబు నేతృత్వంలో రాష్ట్ర విద్యా వ్యవస్థలో మునుపెన్నడూ లేని విధంగా విప్లవాత్మక సంస్కరణలు అమలవుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు శ్రీ వీరంకి వీరాస్వామి పేర్కొన్నారు. విద్యారంగాన్ని దేశంలోనే అత్యుత్తమ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తుంటే మంత్రి లోకేష్ బాబు పై వస్తున్న ప్రజాదరణ తట్టుకోలేక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గొడ్డలి పార్టీ నిరాదర తప్పుడు అసత్య ఆరోపణలతో ఇబ్బందులు సృష్టించేందుకు ప్రయత్నిస్తుందని వీరంకి వీరాస్వామి మండిపడ్డారు. పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు 16 వేల 347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది మంత్రి లోకేష్ బాబుదనీ, ఇది చాలా హర్షించదగిన విషయంఅనీ ఈ సందర్భంగా వీరాస్వామి హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకంద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి లబ్ధి చేకూర్చరని దట్ ఇస్ కూటమి ప్రభుత్వం లోకేష్ మంత్రి లోకేష్ బాబు అని వీరాస్వామి స్పష్టం చేశారు. 16 వేల పైచిలుకు ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల వివరాలు ప్రజలందరికీ తెలిసే విధంగా కుటమిప్రభుత్వం పారదర్శకత్వంతో వ్యవహరించిందని వీరాస్వామి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో జీవోను సైతం రహస్యంగా ఉంచిన వైసీపీ నాయకులు ఈరోజు పారదర్శకంగా చేపట్టిన మెగా డిఎస్సి పై అవాకులు, చవాకులు పేలడం హాస్యాస్పందంగా ఉందన్నారు. ధైర్యం ఉంటే వచ్చే అసెంబ్లీ సమావేశాలకు రావాలని ఎలాంటి చర్చకైనా మా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వీరాస్వామి పేర్కొన్నారు.ఇప్పటికైనా డీఎస్సీ పై అసత్య ఆరోపణలు మానుకోవాలని వీరాస్వామి హితవుపలికారు.ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రామిరెడ్డి సుబ్బారావు, రామిరెడ్డి శ్రీనివాసరావు, ముందడపూ వెంకటరావు, పి .శ్రీనివాసరావు, పి.సుబ్బారావు పి.నాగేశ్వరరావు, తాడపనేని శ్రీనివాసరావు, కృ.నరసింహారావు పేర్నవెంకటరమణ,పూసల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించండి

## ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్.బేగ్

**విజయవాడ,జూలై, 29,(మనం న్యూస్)ః** విజయవాడ కేడీసీసీ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడిసిసి బ్యాంకు)చైర్మన్ నెట్టెం రఘురాంను ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయాల అభివృద్ధి, ఆధునీకరణ, ప్రజలకు మరింత మెరుగైన గ్రంథాలయ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై ఇరువురు చర్చించారు. జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కేడీసీసీ బ్యాంకు తరపున సాధ్యమైనంత సహకారం అందించాలని ఎం.ఎస్. బేగ్ కోరగా, విద్యా వికాసానికి, పఠన సంస్కృతి పెంపొందించడానికి గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న నెట్టెం రఘురాం, గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించడం, యువతకు విజ్ఞాన వనరులను మరింత చేరువ చేయడం ద్వారా సమాజాభివృద్ధికి గ్రంథాలయాలు దోహదపడతాయని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.

# నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలి

## ▸▸ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు జూలై 29 (మనం న్యూస్ ప్రతినిధి)ః** గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ అధ్యక్షతన ఈరోజు అర్ధ వార్షిక క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించబడింది. జిల్లాలోని అన్ని సబ్డివిజన్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు, ప్రత్యేక విభాగాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో గత ఆరు నెలల నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు,ట్రాఫిక్ నిర్వహణ,మహిళలు మరియు చిన్నారుల భద్రత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పెండింగ్ కేసుల పరిష్కారం వంటి అంశాలపై జిల్లా ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్కు ప్రాధాన్యం:పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలన్నారు. చిన్న చిన్న వివాదాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ-సాక్ష్య , వినియోగం:ప్రతి కేసుకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలను ఈ-సాక్ష్య యాప్లో తప్పనిసరిగా నమోదు చేయాలని,సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు నాణ్యతను పెంచి కోర్టుల్లో శిక్షలు పడేలా బలమైన కేసులు రూపొందించాలని సూచించారు.ప్రాపర్టీ రికవరీ విజిబుల్ పోలీసింగ్:ఆస్తి సంబంధిత కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతి స్టేషన్ పరిధిలో రోజువారీ విజిబుల్ పోలీసింగ్,వాహనాల తనిఖీలు, గ్రామ సందర్శనలు, నేరాల నివారణ చర్యలు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు.రాత్రి గస్తీ మరింత పటిష్టం:రాత్రి గస్తీ సిబ్బంది లారీ లు ,టార్చ్లైట్లు, విజిల్స్తో పూర్తి సన్నద్ధతతో విధులు నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్/లైవ్ స్కానర్ ద్వారా పరిశీలించి వారి నేర చరిత్రను వెంటనే గుర్తించాలని సూచించారు. డయల్-112 అత్యవసర స్పందన:రక్షక్ వాహనాలు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో పట్టణ ప్రాంతాల్లో 10 నిమిషాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకొని ప్రజలకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. రోడ్డు భద్రత



హైవే పెట్రోలింగ్:హైవే పెట్రోలింగ్ వాహనాలు ప్రమాద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని,బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని,అనధికారిక పార్కింగ్ను నివారించాలని, హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. మహిళలు,చిన్నారుల భద్రత: మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీట్లు,సస్పెక్ట్ షీట్లు:హత్య, అత్యాచారం, దోపిడీ, ఎక్స్టార్షన్ వంటి తీవ్రమైన నేరాల్లో పాల్గొనే నేరస్థులపై అవసరమైన చోట రౌడీషీట్లు, సస్పెక్ట్ షీట్లు తెరవాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు .గంజాయి కేసులపై ప్రత్యేక దృష్టి:నార్త్, తెనాలి,తుళ్లూరు సబ్డివిజన్లలో పెండింగ్లో ఉన్న గంజాయి కేసుల్లో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.

### కోర్టు కేసుల పర్యవేక్షణ

కోర్టు విచారణలో ఉన్న కేసులను నిరంతరం పర్యవేక్షిస్తూ సాక్షులను సమర్థంగా హాజరు పరచి నిందితులకు శిక్షలు పడేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆస్తుల నిర్వహణ స్టేషన్లలో దీర్ఘకాలంగా ఉన్న వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించి, నిరుపయోగంగా ఉన్న వాహనాలను నిబంధనల ప్రకారం వేలం ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అప్రమత్తత:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తమ పరిధిలోని రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గ్రామ స్థాయి సమస్యలు, సున్నిత ప్రాంతాలపై పూర్తి సమాచారం కలిగి ఉండి శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.పోలీస్ సిబ్బంది సంక్షేమం ప్రత్యేక ద్రుష్టి : ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని, విధి నిర్వహణలో ప్రయాణించే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సూచించారు .సమావేశం అనంతరం గత ఆరు నెలల కాలంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన క్రైమ్ ఎస్పీ( ఎన్ సి) కె. సుప్రజ,సౌత్ డీఎస్పీ జి. పూర్ణచంద్రరావు ,మహిళల పీస్ డీస్పీ శ్రీనివాస్ రెడ్డి,వివిధ పోలీస్ స్టేషన్ల సీఐలు,ఎస్ఐలు,ఐటీ కోర్ సిబ్బంది, కోర్టు స్టాఫ్, స్పెషల్ బ్రాంచ్ ,టాస్క్ ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ప్రశంసించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో క్రైమ్ (ఎన్ సి) కె.సుప్రజ ,అదనపు ఎస్పీ రమణమూర్తి ,స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి అలహరి శ్రీనివాస్,ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు,మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ ,డీసీఆర్బి సీఐ ప్రభాకర్ రావు,ఐటీ కోర్ సీఐ నిస్సర్ బాషా,ధర్మేంద్ర బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లికార్జునరావు జిల్లాలోని అన్ని సబ్డివిజన్ల సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి వసంత నాగేశ్వరావు జన్మదిన వేడుకలు



## ▸▸ ప్రజా నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు,ప్రజా ప్రతినిధులు, అభిమానులు

**నందిగామ,జులై29(మనం న్యూస్)ః** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా, ప్రజా సేవకు ప్రతీకగా నిలిచిన మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు బుధవారం మండలంలోని ఐతవరం గ్రామంలో ఘనంగా జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కార్యకర్తలకు అండగా, సామాన్య ప్రజల సమస్యలకు స్పందించే నాయకుడిగా ఆయన వసంత నాగేశ్వరావు విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చి, క్రమంగా పార్టీలో వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కృషి అందరికీ తెలుసు. ప్రతి కార్యకర్త ఇంటి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కరించే గుణం వల్ల 'మా అన్న' అని వేలాది మంది ఆయనను అభిమానిస్తారు. ఆయన మాటలో



నిజాయితీ, చేతిలో చిత్తశుద్ధి కనిపిస్తాయి. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకమై ఉండటమే ఆయన ప్రత్యేకత. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే నాయకుడు, కార్యకర్తలకు, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. కష్టకాలంలో ప్రజలకు సహాయం చేస్తారు. స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి శారిస్తారు. ఈరోజు ఆయన అభిమానులు, తెలుగుదేశం పార్టీ





పేరు పొందారు.రాష్ట్రంలోనే చిన్ననగా పేరు పోందిన గొప్ప నేత వీర వసంత అని వేడుకల్లో పలువురు అన్నారు. రాజకీయ ప్రస్థానం లో



కార్యకర్తలు రక్తదాన శిబిరాలు, హెల్త్ క్యాంపులు, అన్నదాన కార్యక్రమాలు, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్ల కంటే ప్రజాసేవయే అసలైన పుట్టినరోజు కానుక అని నమ్మే నాయకుడు ఆయన. రాజకీయాల్లో విలువలకు, నిబద్ధతకు మారుపేరుగా ఉన్న వసంత నాగేశ్వరావు కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఇలాగే సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో ఉండి ప్రజలకు మరెన్నో సేవలు అందించాలని, విజయవాడ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ప్రజా నాయకుడికి, కార్యకర్తల ఆత్మీయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు. మీ నాయకత్వం మాకు స్ఫూర్తి. మీరు ఇలాగే ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాం.



▶▶ సూర్య మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, కూటమి నేతలతో కలిసి సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.

**నందిగామ,జులై29(మనం న్యూస్):** నందిగామ మండలం ఐతవరం గ్రామంలో మాజీ మంత్రివర్యులు వసంత నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఐతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) భవనంలో సూర్య మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ మంత్రివర్యులు వసంత నాగేశ్వరరావు మరియు కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యులు మరియు నిర్వాహకులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడేలా మెగా వైద్య శిబిరం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలే కుటుంబం.. ప్రజా సంక్షేమమే లక్ష్యం

▶▶ ప్రజల ముంగిటకు కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు.

▶▶ 'అభివృద్ధి-సంక్షేమానికి రెండేళ్ల నమ్మకం..

▶▶ కూటమి ప్రభుత్వం' కరపత్రాలతో ఇంటింటా ప్రచారం..

▶▶ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.



**నందిగామ,జులై29(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన 'అభివృద్ధి-సంక్షేమానికి రెండేళ్ల నమ్మకం.. కూటమి ప్రభుత్వం' కరపత్రాలను నందిగామ పట్టణం పెద్ద మసీదు సెంటర్, కుమ్మరి బజార్ ప్రాంతాల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజలను నేరుగా కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలకు తిరిగి ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరుగుతోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. 'ప్రజలే కుటుంబం.. ప్రజా సంక్షేమమే లక్ష్యం'₹ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజల ఆశీస్సులు, కూటమి నేతలు, కార్యకర్తల సహకారంతో నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## మాజీ హోంశాఖా మంత్రివర్యులు వసంత నాగేశ్వరరావుకి జన్మదిన శుభాకాంక్షలు



▶▶ మెలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్తో కలిసి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ,జులై29(మనం న్యూస్):** మాజీ మంత్రివర్యులు వసంత నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మరియు కూటమి నాయకులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వేడుకల్లో పాల్గొని వసంత నాగేశ్వరరావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వసంత నాగేశ్వరరావుని శాలువాతో ఘనంగా సత్కరించి, మొమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

# అసలు నందిగామ నియోజకవర్గానికి ఏమైంది




▶▶ ఎందుకు ఈ దుస్థితి ...

▶▶ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు

**చందర్లపాడు,జులై29(మనం న్యూస్):** ప్రజా ప్రతినిధి అసమర్థత - చేతకానితనంతో... నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ లో అంతర్గత విభేదాల వలన వారు వారే ప్రాణాలు తీసుకునేటట్లు... చేలరేగిపోతున్నారు.. నిన్న రాత్రి తుర్లపాడు గ్రామంలో జెండా దిమ్మె విషయంలో - టీడీపీ వారే విచక్షణ రహితంగా కొట్టుకొని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. మొన్నటికి మొన్న విభరింతలపాడులో టీడీపీ కార్యకర్త అయిన ఉపాధి హామీ మహిళ - అదే పార్టీకి చెందిన నాయకుడి వేధింపుల వలన సెల్ఫీ వీడియో తీసుకొని ప్రాణాలు తీసుకుంది. వారం క్రితం ఒక బీసీ నాయకుడు అదే పార్టీకి చెందిన పట్టణ అధ్యక్షుడి వేధింపుల వలన సాక్షాత్తు ఎమ్మెల్యే కార్యాలయంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిన్న కాక మొన్న బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో ఓ ప్రేమ కథలో తెలుగు దేశం నాయకుడి వేధింపుల వలన తన బిడ్డ పోలీస్ స్టేషన్ లో చిత్రహింసలు భరిస్తున్నాడు అని అదే పార్టీకి చెందిన ఆ పిల్లాడి తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఇవన్నీ చూస్తుంటే... అసలు నందిగామ నియోజకవర్గానికి ఏమైంది... మీ చేతకానితనం వలన ఇన్నీ ప్రాణాలు పోతున్నాయి.ఎంతమంది బలై పోతున్నారు. ప్రజా ప్రతినిధి కి - షాడో ఎమ్మెల్యే కు డబ్బుల సంపాదన మీద ఉన్న యావ - పార్టీ పై... నియోజకవర్గం పై లేకపోవడం తోనే... ఇవన్నీ జరుగుతున్నాయి. మొన్న వీరులపాడు లో తెలుగుదేశం పార్టీకి చెందిన పేకాట శిబిరాల నిర్వాహకుల మధ్య కూడా ఘర్షణ తలెత్తి వివాదం పోలీస్ స్టేషన్ కేసుల వరకు వెళ్తే... మీరు చేతకాని తనం తో - వైసీపీ వాళ్ళు పోలీసులుకు పార్టీలు ఇచ్చి ఒక వర్గానికి కొమ్ము కాశారు.. పోలీసులు వైసీపీ తో అంటకాగుతున్నారని ప్రచారం చేశారు. మేము హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ లో సంతకాలు పెట్టడానికి వెళ్తే... మా పార్టీ కి చెందిన 22 మంది పై ఉత్త పుణ్యానికి కేసు పెట్టారు... అదేంటి అంటే స్టేషన్ కి కార్యకర్తలు వచ్చారు అంటారు - ఒక పార్టీ ఎమ్మెల్సీ - మాజీ ఎమ్మెల్యే - ఆ పార్టీ నాయకులు - స్టేషన్ కు వెళ్తే... కార్యకర్తలు రారా ??... ఇదేక్కడి విచిత్రమైన కేసు ??.. గత రెండేళ్లుగా నియోజకవర్గంలో మురికి పట్టిన రోడ్లు - బాగు చేయని కాలువలు - చూస్తున్నాం... ఇప్పుడు మురికి పరిపాలన - మురికి పట్టిన ప్రభుత్వ వ్యవస్థలు చూస్తున్నాం... పోలీస్ వ్యవస్థ ను కూడా పూర్తిగా భ్రష్టు పట్టించారు... ఎవరి మీద కేసులు పెడుతున్నారు - ఎందుకు పెడుతున్నారో అర్థం కానీ పరిస్థితి -- పోలీసులు మా జేబు వ్యవస్థ అనే మాదిరిగా తెలుగు దేశం నేతలు వ్యవహరిస్తున్నారు. మేము దయ ఉంచి పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నాం... నందిగామలో అధికారం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది... ఇది ఎప్పుడు ఎవరిపై విసురుతారో తెలియని పరిస్థితి -- ఇప్పటికైనా పోలీసులు కాస్తంత శాంతిభద్రతలపై శ్రద్ధ పెట్టి నందిగామ నియోజకవర్గ ప్రజలు శాంతియుతంగా జీవించేలా చూడాలని వేడుకుంటున్నాం ... టిడిపి నేతలు కళ్ళు మూసుకొని... లోకం గుడ్డిదని భావిస్తున్నారు... కానీ జరుగుతుందంతా ప్రజలు చూస్తున్నారు - గమనిస్తున్నారు ... చేసిన పాపాలకు మూల్యం చెల్లించుకోక తప్పదు... అని వ్యాఖ్యానించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు.అనంతరం తుర్లపాడు గ్రామ నాయకులు మాట్లాడుతూ... టిడిపి నేతలే జెండా దిమ్మె విషయంలో వారికి వారే కొట్టుకుంటే - వైసీపీ - టీడీపీ మధ్య ఘర్షణ అని కొన్ని మీడియాలలో ప్రచారం చేస్తున్నారు... దీన్ని పూర్తిగా ఖండిస్తున్నాం... వారు వారు కొట్టుకుంటే స్థానిక ప్రజాప్రతినిధి రాజీ పెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారు -- వైసీపీ చెందిన వారిపై కేసులు కట్టాలని చూస్తున్నారు... అసలు ఈ గొడవ లో వైసీపి వారు లేరని తెలిపిన తుర్లపాడు గ్రామస్తులు .. ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు ...

# ఘనంగా అభినందన సభ

▶▶ సమ్మర్ క్యాంపు బాగా నిర్వహించినందుకు కృష్ణాజిల్లా ఉత్తమ గ్రంథపాలుడుగా అల్లూరు రామచంద్రుడుకి అవార్డు

**నందిగామ,జులై29(మనం న్యూస్):** నందిగామ శాఖ గ్రంథాలయం నందు గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు ఇటీవల సమ్మర్ క్యాంపు బాగా నిర్వహించినందుకు కృష్ణాజిల్లా గ్రంథాల సంస్థ లోఉత్తమ గ్రంథపాలుడుగా అవార్డు వచ్చిన సందర్భంగా నందిగామ శాఖ గ్రంథాలయం నందు ఈరోజు అభినందన సభ నిర్వహించడమైనది. నందిగామ గ్రంథాలయ పాఠకులు కనగాలఅనిల్, బానోతుల నాయక్, రాము నాయక్, తదితర పాఠకులు, సమ్మర్ క్యాంప్ విద్యార్థులు గ్రంథాలయ అధికారి రామచంద్రుడు ను శాలువాతోను,మెమోటోతో ఘనంగా సన్మానించారు. అందుకు గ్రంథాలయ అధికారి రామచంద్రుడు పాఠకులకు, సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# తొలగించిన ఎన్టీఆర్ విగ్రహం స్థానంలోనే సుందరంగా తీర్చిదిద్దిన ప్రదేశంలో ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం

- **అన్న ఎన్టీఆర్ విగ్రహం తొలగింపు బాధాకర మే అయినా తప్పని పరిస్థితుల్లో అందరి అనుమతితో తీసుకున్న నిర్ణయం**
- **మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర**

జగ్గయ్యపేట జూలై 29 మనం న్యూస్ : ఎన్టీఆర్ సర్కిల్లో తొలగించిన నందమూరి తారక రామారావు విగ్రహం స్థానంలో సర్వోన్నతమైన వేదికపై అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ప్రదేశంలో ఇప్పుడు ఉన్న విగ్రహం కన్నా భారీ ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహం తొలగింపుతో కళ తప్పిన మున్సిపల్ సెంటర్ అన్న వార్తకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర స్పందించారు. ఈ విషయమై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలో పెరిగిన రద్దీ ట్రాఫిక్కు తో మహనీయుడు ఎన్టీ రామారావు విగ్రహం వేదిక ఉన్న ప్రదేశం తో సెంటర్లో భారీ వాహనాలు కోదాడ రోడ్డు వైపు తిరిగేందుకు తరచూ ఇబ్బంది , ట్రాఫిక్ సమస్య ఏర్పడు తోందన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, పార్టీ పెద్దలు నెట్టెం రఘురాం , తదితర ఉన్నత నేతల దృష్టికి తీసుకువెళ్లామని, ఇంజనీరింగ్ అధికారులు, కౌన్సిల్ సభ్యులతో చర్చించి ఎన్టీఆర్ విగ్రహం అక్కడ నుంచి తొలగించే పనులు చేపట్టినట్లు తెలిపారు. విగ్రహం తొలగించకుండా విస్తరణ పనులు చేపట్టడం సాధ్యం కాదని ఇంజనీరింగ్ అధికారులు తెలిపినట్లు చైర్మన్ రాఘవేంద్ర వివరించారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి తొలగించిన ఎన్టీఆర్ విగ్రహం స్థానాల్లో ఇప్పటికన్నా ఎత్తైన ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయటమే కాక అన్న ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ సర్వాంగ సుందరమైన ఫౌంటెన్ అన్నిహంగులతో చూచే వారి హృదయాలను హత్తుకునేలా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్ది ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు కోదాడ రోడ్డు వైపు షాపుల తొలగింపు, రైతు బజార్ ఎదురుగా రోడ్డు విస్తరణ, పాత మున్సిపల్ కార్యాలయం తొలగింపు తదితర పనులు పూర్తి అయ్యాయని త్వరలోనే ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు వేదిక పనులు ప్రారంభించను న్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహం తొలగింపుతో అభిమానులు పార్టీ కార్యకర్తలు మన స్థాపాన్ని గురి కావద్దని, అన్న నందమూరి తారక రామారావు విగ్రహం తొలగింపు, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ కు, పార్టీ పెద్దలకు, తనకు కౌన్సిల్ సభ్యులకు అందరికీ ఆవేదన కలిగించే అంశమే అయినా పట్టణంలో పెరిగిన రద్దీ



,ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు, సర్వోన్నతమైన ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేయాలనే తలంపుతో బాధాకర మే అయినా తప్పని పరిస్థితులలో విగ్రహం తీసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆగస్టు చివరి నాటి కల్లా అన్ని సుందరీ కరణ పనులు పూర్తి చేసుకొని ఉన్నతమైన వేదికపై ఎన్టీఆర్ భారీ కాంస్యవిగ్రహం ఏర్పాటు అవుతుందని చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. తొలగించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని సముచిత స్థానంలో ఏర్పాటు చేసేందుకు పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకుంటున్నారని వివరించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ భారీ విగ్రహ నిర్మాణం పూర్తి అయిన తర్వాత చూసిన వారు చాలా బాగా చేశారు. అని మెచ్చుకునేలా ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు.

# శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామికి గురు పౌర్ణమి సందర్భంగా గరుడసేవ

నందిగామ,జులై29(మనం న్యూస్)ః పల్లగిరి కొండ మీద వేంచేసి ఉన్నశ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో ఈరోజు గురు పౌర్ణమి సందర్భంగా గరుడసేవ మహోత్సవము మరియు ఉదయం హోమము స్వామివారికి అభిషేకాలు విశేషార్చనలు 12 ద్వాదశ ప్రదక్షిణలు జరిగాయి. ప్రత్యేకంగా గరుడ పక్షి భక్తులందరికీ దేవస్థానంపై దర్శనమీయటం విశేషమైనటువంటి విషయం. స్వామి కృప కటాక్షాలు అందరి భక్తులు మీద ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.



# గ్రామ గ్రామాన అభివృద్ధి జోరు..

- **కూటమి ప్రభుత్వమే ప్రజా సంక్షేమానికి చిరునామా..**
- **ఐతవరంలో ఎంపీ లాడ్స్ నిధులతో రూ.44 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు ప్రారంభం.. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.**

నందిగామ,జులై29(మనం న్యూస్)ః నందిగామ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.44 లక్షలతో నిర్మించిన నూతన సీసీ రోడ్డును బుధవారం మాజీ మంత్రివర్యులు వసంత నాగేశ్వరరావు, కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గత పాలనలో ఏర్పడిన అప్పుల భారంతో ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడా విస్మరించకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఐతవరం గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలు, రైతుల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుందని, గ్రామాభివృద్ధికి ఇది మరొక ముందడుగు అని తంగిరాల సౌమ్య గారు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఈసీఐ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి



- **పట్టభద్రులు, ఉపాధ్యాయులు,స్థానిక సంస్థల నియోజకవర్గాల ఓటర్ల జాబితాల తయారీ పకడ్బందీగా చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ**

గుంటూరు, జూలై 29:( మనం న్యూస్ ప్రతినిధి) ః పట్టభద్రులు,ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాజేష్ కుమార్ సింగ్, రోహిత్ కుమార్, స్వతంత్ర కుమార్ మీనా, మల్లికార్జున్ రెడ్డి లతో కలసి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఈ ఆర్ ఓ ల సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించిన నిబంధనలు, అర్హతలు, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల నియోజకవర్గాల ఓటర్ల జాబితాల తయారీలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.పట్టభద్రులు,ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునే వారి అర్హతను సంబంధిత ధ్రువపత్రాల ఆధారంగా పరిశీలించాలని,ఎలాంటి సందేహాలకు తావులేకుండా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితా తయారీలో కూడా ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ముసాయిదా జాబితా ప్రచురణ,అభ్యంతరాలు మరియు క్లెయిమ్ల స్వీకరణ, తుది ఓటర్ల జాబితా ప్రచురణ వంటి ప్రతి దశను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, ఎన్నికల సంఘం సూచనలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ షేక్ ఖాజావలి, జెడ్పి సి ఈ ఓ జ్యోతి బసు, డి పి ఓ సాయి కుమార్, ఈ ఆర్ ఓ లు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ కన్యాకా పరమేశ్వరీ అమ్మవారు



- **ఆకుకూరలు కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరణ**

నందిగామ,జులై29(మనం న్యూస్)ః నందిగామలో ఆషాడ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీ కన్యాకా పరమేశ్వరీ అమ్మవారు బుధవారం శాకంబరీ దేవిగాభక్తులకు దర్శనమిచ్చారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిసి గ్రామాలు పాడిపంటలతో తులతూగాలని కాంక్షిస్తూ శ్రీ కన్యాకా పరమేశ్వరీ శాకంబరీ ఉత్సవాల పురస్కరించుకొని ఆకుకూరలు కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష అర్చనలు కుంకుమ పూజలు వేదొక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చవట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వనమా నరసింహారావు, కోసాధికారి మారం సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



- **ఆధ్యాత్మికతతో పాటు సేవా స్ఫూర్తి**
- **భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

నందిగామ,జులై29(మనం న్యూస్)ః నందిగామ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర నగర్లో ఉన్న సాయి అయ్యప్ప దేవాలయంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, భక్తులు, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబా వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి విశేష ఆశీర్వచనం అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా భక్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించి, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందించారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేను భక్తులు, కూటమి నాయకులు అభినందించారు.

## శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అంబరుపేట శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారు

- **ఆకుకూరలు కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరణ**



నందిగామ,జులై29(మనం న్యూస్)ః నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో ఆషాడ పౌర్ణమి పురస్కరించుకుని సత్యమ్మ అమ్మవారి నామస్మరణ నడుమ బుధవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శాకంబరీ దేవిగా శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ఈవో పీవీకే సీతారావమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మంచాల మాధవరావు, ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో భక్తుల సహాయ సహకారాలతో వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిసి గ్రామాలు పాడిపంటలతో తులతూగాలని కాంక్షిస్తూ శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ శాకంబరీ ఉత్సవాల పురస్కరించుకొని ఆకుకూరలు కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు నందిగామ సుబ్బారావు శర్మ, కోటేశ్వర శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు విశేష అర్చనలు కుంకుమ పూజలు వేదొక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.. మూడు రోజులపాటు శాకంబరీ ఉత్సవాలకు భక్తులు సహాయ సహకారాలు అందించాలని ఆలయ కమిటీ చైర్మన్ మాధవరావు విజ్ఞప్తి చేశారు.

## ఐతవరంలో రూ.25 లక్షలతో నూతన డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్(డిఎల్డివో) కార్యాలయ భవనం ప్రారంభం

- **కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలకు పరిపాలనా సౌకర్యాలు..**
- **అభివృద్ధికి మరింత ఊతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ,జులై29(మనం న్యూస్)ః నందిగామ మండలం ఐతవరం గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో రూ.25 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న నూతన డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీస్ (డిఎల్డివో) భవనాన్ని బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్, మాజీ మంత్రివర్యులు వసంత నాగేశ్వరరావు, కూటమి నేతలు, అధికారులు మరియు డిఎల్డివో ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, అమలులో కార్యాలయం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు.జిల్లా పరిషత్ నిధులతో ఐతవరం గ్రామంలో నూతన కార్యాలయ భవనం నిర్మాణం పూర్తి కావడం సంతోషకరమని, ఈ కార్యాలయం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు పరిపాలనా సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పరిపాలనా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 40వ వసంతంలోకి కాకతీయ అపోలో విద్యాసంస్థలు



- **క్రమశిక్షణ,విలువలు, విశ్వసనీయ, నిబద్ధతతో విద్యబోధనే మా లక్ష్యం**
- **చైర్మన్ కాపా రవీంద్రనాథ్**

నందిగామ, జులై29(మనం న్యూస్)ః విలువలు, విశ్వసనీయత, క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన విద్యనందించడమే లక్ష్యమని,ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతీసుకోని విద్యను అందించడం ద్వారానే తమ విద్య సంస్థకు మంచి గుర్తింపు లభించిందని కాకతీయ అపోలో విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. నందిగామ ప్రాంతంలో స్థానిక కాకతీయ అపోలో విద్యాసంస్థలలో వేసవి సెలవుల అనంతరం తిరిగి నూతన విద్యా సంవత్సరంలోకి అడుగెడుతున్న విద్యార్థినీ విద్యార్థులను 40వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కాకతీయ అపోలో విద్యాసంస్థలు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎంతో ఘనంగా పూలతో ఆహ్వానం పలికారు.. సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులను అలరించారు.. ఈ సందర్భంగా చైర్మన్ కాపా రవీంద్రనాథ్ మాట్లాడుతూ... విద్యా విధానంలో ఎన్నో నూతన వరవడులు వస్తున్నాయని వాటికి అనుగుణంగానే విద్యార్థులు రెడీగా ఉండాలని... విద్యతోపాటుగా స్కిల్ డెవలప్మెంట్ అలవర్చుకోవాలని ప్రతిరోజు తప్పకుండా చదవడం, రాయటం అలవాటుగా చేసుకోవాలని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాపా భారతి,హెడ్ మాస్టర్ పగడాల వీర రాఘవులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## మానవత ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థిక సాయం



హనుమాన్ జంక్షన్: 29 ( మనం న్యూస్ )ః మానవతా హనుమాన్ జంక్షన్ వారిచే విద్య వైద్యానికి 10,000 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. బుధవారం ఏలూరు రోడ్ లోని మానవతా కార్యాలయంలో జరిగిన నెలవారి సమావేశంలో ఏలూరు లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న కడుపు ఎల్లయ్య కుమార్తె పూజిత కు ఫీజు నిమిత్తం 5,000 వేల రూపాయలు ఆర్థిక సహకారము మరియు బాపులపాడు కు చెందిన నారాయణపురం మురళీకృష్ణ వైద్య ఖర్చుల నిమిత్తం 5,000 వేల రూపాయలు మొత్తం 10,000 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు , జిల్లా కార్యదర్శి జే వి వి సత్యనారాయణ, పూర్వ అధ్యక్షులు బాణాల నరసింహారావు, సుబ్బారావు కూరెళ్ల సుబ్బాచారి, జయ రామచంద్రరావు, కొట్నాని రామచంద్రరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కార్యదర్శి పాబోలు గణేష్ ట్రెజరర్ మరీదు వెంకటస్వామి నారగాని కొండలరావు, శ్రీధర్ మల్లికార్జునరావు, దయాల ప్రభాకర్రావు, కళ్లేపల్లి నారాయణ రావు, చెక్కా సుబ్బారావు, పి వి చలం తదితరులు పాల్గొన్నారు.

# హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సె చేతుల మీదుగా గుంటూరులో హియ్యు డైనో మండి రెస్టారెంట్ గ్రాండ్ లాంచ్



**గుంటూరు జూలై 29 (మనం న్యూస్ ప్రతినిధి)**ః గుంటూరు అంటేనే రుచులకు నిలయం. తాజాగా గుంటూరు ప్రజలకు సరికొత్త రుచిని అందిస్తూ హియ్యు డైనో మండి రెస్టారెంట్ ప్రారంభం అయింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న అందాల తార భాగ్యశ్రీ బోర్సె చేతుల మీదుగా నాలుగవ బ్రాంచ్ గా హియ్యు డైనో మండి రెస్టారెంట్ గ్రాండ్ లాంచ్ గుంటూరులో ఘనంగా ప్రారంభం అయింది. పిల్లలను, పెద్దలను ఆకర్షించే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ రెస్టారెంట్ అందరిని ఆకర్షిస్తుంది. ఈ సందర్భంగా హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ. గుంటూరు ప్రజలందరికి హియ్యు డైనో మండి గురించి ముందే తెలుసు, హైదరాబాద్ లో చాలా పాపులర్ అని అన్నారు. ఇక్కడ ఫుడ్ చాలా రుచిగా ఉందన్నారు. అందరూ తప్పకుండా వచ్చి ఒక్కసారి ఆ రుచిని చవిచూడాలని పేర్కొన్నారు. ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ వస్తారు, కచ్చితంగా నచ్చుతుందని అన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఈ వాతావరణాన్ని బాగా ఇష్టపడతారని పేర్కొన్నారు. ఒక ఫ్యామిలీ ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతంగా భోజనం చేసేలా ఉందని తెలిపారు. ముఖ్యంగా తన అభిమానులకు హియ్యు డైనో మండికి స్వాగతం పలికారు. గౌతమి చౌదరి మాట్లాడుతూ. ముందుగా మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు .గుంటూరులో ప్రారంభించిన హియ్యు డైనో మండి రెస్టారెంట్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్యూటిఫుల్ హీరోయిన్ భాగ్యశ్రీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఏషియాలోనే ఫస్ట్ థియేట్రికల్ రెస్టారెంట్ హియా డైనో మండి అని వెల్లడించారు.తక్కువ డబ్బులతో మంచి వాతావరణంలో .రుచికరమైన భోజనం తినాలి అంటే సరియైన ప్లేస్ లేదని అనిపించి గుంటూరులో హియ్యు డైనో మండి రెస్టారెంట్ ను స్థాపించామని తెలిపారు. ఇకపై కుటుంబ సమేతంగా గుంటూరు ప్రజలు వస్తారని, తెలంగాణ, ఆంధ్ర ఏ ప్రాంతం వారైనా గుంటూరుకు వచ్చారంటే హియమండిని సందర్శించండి అని తెలిపారు. గౌతమ్ మాట్లాడుతూ. గుంటూరులో హియ్యు డైనో మండి రెస్టారెంట్ ప్రారంభత్సవానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఇది నాలుగవ బ్రాంచ్ అని,ఆదరిస్తున్న కస్టమర్లకు, భోజనం ప్రియులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే మమ్ముల్ని నమ్మి ఇక్కడ గుంటూరులో బ్రాంచ్ ఓపెన్ చేసిన వారికి కూడా థాంక్స్ అని చెప్పారు. విక్రాంత్ మాట్లాడుతూ.. హియ్యు డైనో మండి రెస్టారెంట్ కు వస్తున్న ఆదరణ చాలా సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు.గుంటూరు అంటేనే చాలా రుచులకు పేరు, అలాంటిది మా రెస్టారెంట్ రుచిని కూడా ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గుంటూరుకు హియ్యు డైనో మండి రెస్టారెంట్ ఒక ల్యాండ్ మార్క్ అవుతుందని తెలిపారు.గుంటూరు ఫ్రాంచైస్ ఓనర్ మాట్లాడుతూ.గుంటూరులో హియ్యు డైనో మండి రెస్టారెంట్ ఓపెనింగ్ కు వచ్చిన హీరోయిన్ భాగ్యశ్రీ, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. నాలుగు నెలలుగా ఈ రెస్టారెంట్ డిజైనింగ్ కోసం ఎంతో కష్టపడ్డామని తెలిపారు. కానీ ఫైనల్ గా అన్ని విధాల రెస్టారెంట్ అదిరిపోయిందని, ఇక ఫుడ్ విషయంలో టాప్ క్వాలిటీ గా ఉందని తెలిపారు. గుంటూరు ప్రజలు మాత్రమే కాదు గుంటూరుకు వచ్చిన అందరూ హియ్యు డైనో మండి రెస్టారెంట్ ఒక్కసారి ట్రై చేస్తే ఎప్పటికీ మర్చిపోరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పలువురు రాజకీయ నాయకులు మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు

# అత్యాధునికంగా ఆధునికరించిన అన్నపూర్ణ హీరో షోరూం నూతన ప్రారంభం

**గుంటూరు జులై 29 (మనం న్యూస్ ప్రతినిధి)**ః స్థానిక కొత్తపేట ఓల్ క్లబ్ రోడ్ లో అత్యాధునికంగా ఆధునికరించిన అన్నపూర్ణ హీరో షోరూం నూతన ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ సందర్భంగా షోరూం నిర్వాహకులు వీరంకి వెంకట సోమేశ్వరరావు, వీరంకి సాయి ధనిష్ట మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన హీరో షోరూం సంబంధించిన టు వీలర్లను కస్టమర్లకు అందుబాటులోకి తీసుకురావటం తో పాటు మంచి సర్వీసు ముఖ్యంగా గుంటూరు నగరంలో అన్ని ప్రాంతాలకు దగ్గరగా ఉండే విధంగా అన్నపూర్ణ ఆటోమేటివ్ హీరో షోరూంను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ షోరూం ద్వారా హీరో




కంపెనీకి సంబంధించిన అన్ని మోడల్ టూవీలర్ లు మరియు అన్ని రకాల సర్వీసెస్ అందుబాటులో ఉంటాయని వినియోగదారు లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బంధుమిత్రులు స్నేహితులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# ఆగస్టు 6న సీపీఐ పాదయాత్రలకు శ్రీకారం




- **అనంతరం సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ..జయప్రదం చేయండి..**
- **ముప్పాళ్ళ నాగేశ్వరరావు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు.**

**గుంటూరు జూలై 29: (మనం న్యూస్ ప్రతినిధి)**ః ధరల పెరుగుదల నియంత్రణ, యువతకు ఉద్యోగాలు, రైతులకు గ్యారంటీ మద్దతు ధర (ఖ్కి), మహిళల రక్షణ,సార్వత్రిక విద్య-ఆరోగ్యం,కార్మికుల హక్కుల పరిరక్షణ తదితర డిమాండ్లతో సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించే 'చలో ఢిల్లీ' మహార్యాలీలో పెద్దఎత్తున పాల్గొనాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.బుధవారం గుంటూరు కొత్తపేటలోని సిపిఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 6 నుంచి 15 వరకు పాదయాత్రలు, ఆగస్టు 17 నుంచి 28 వరకు ప్రజా సంఘాల ఆందోళనలు నిర్వహించి, అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలకు న్యాయం చేయాలని, అత్యాచారాలు, వివక్షను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా ఈ సమావేశంలో ముప్పాళ్ళ తో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం మార్పు కోసం పాదయాత్ర,చలో ఢిల్లీ కార్యక్రమాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

# నగర పాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు

**గుంటూరు నగరపాలక సంస్థ జూలై 29 (మనం న్యూస్ ప్రతినిధి)**ః గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో మేజర్, మీడియం డ్రైన్లలో రెండో విడత పూడికతీత పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంజనీరింగ్ అధికారులు మరియు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ ఏడాది పూడికతీత కాంట్రాక్ట్ నిర్వహణ 90 రోజులు పాటు సదరు కాంట్రాక్టర్ దే భాధ్యత ఉండేలా నిబంధనలు పొందుపరిచినందున వారితోనే రెండో విడత పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. పూడికతీత పనులను ప్రతి పాయింట్ లో ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, లోపాలు గుర్తిస్తే సంబంధిత అధికారులు భాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే కీలకమైన రోడ్ విస్తరణ, అభివృద్ధి పనుల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పునఃప్రారంభించి,పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాటర్ మీటర్ రీడింగ్స్ పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించి, ప్రతి నెల 3వ వారం రీడింగ్స్ తీయాల్సిందేనని స్పష్టం చేశారు.ప్రతి సచివాలయం పరిధిలో త్రాగునీటి సరఫరా సమయంలో 10 శ్యాంపిల్స్ తీసి, సిఎంఎం యాప్ లో అప్ లోడ్ చేయాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో డివైడర్ ప్లాంటేషన్ చేపట్టాలని, 15 ఫైనాన్స్ నిధులతో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయడానికి పిన్ పాయింట్ షెడ్యూల్ సిద్దం చేయాలని డిఈఈలను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న జిటిఎస్ లపై రోజువారీ నివేదిక ఇవ్వాలని, ఈఈలు ప్రత్యక్ష్య పర్యవేక్షణ చేయలన్నారు.సమావేశంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, సిటి ప్లానర్ రాంబాబు,డిసిపి సూరజ్ కుమార్, ఈఈలు విష్ణు, వేణుగోపాల్, డిఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.



# మాజీ కార్పొరేటర్ పోతురాజు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు

**గుంటూరు జూలై 29 (మనం న్యూస్ ప్రతినిధి)**ః స్థానిక కొత్తపేటలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 6 వ వార్డు మాజీ కార్పొరేటర్ పోతురాజు సమత, పోతురాజు చంద్రశేఖేశర్, పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమలు నిర్వహించారు. పోతురాజు రామకృష్ణ పోతురాజు వెంకట్ నిర్వహణలో ఉదయం బాబా వారికి పంచాంగం పంచామృత అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది ప్రజల ఆరాధ్య దైవం శ్రీ షిరిడి సాయిబాబా అని స్థానిక కొత్తపేట లో గత 19 సంవత్సరాలుగా బాబా వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 3000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం అంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.





# శాకాంబరీ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు



గుంటూరు జూలై 29 (మనం న్యూస్ ప్రతినిధి)ః శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న పవిత్ర శాకాంబరీ దేవి ఉత్సవాల్లో భాగంగా ఆలంకార మండపంలో ఆలయ సిబ్బంది,శివసేవకులతో కలిసి అమ్మవారి విశేష అలంకరణ కోసం నిమ్మకాయలను సేకరించి,వాటిని మాలలుగా సిద్ధం చేసే సేవా కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి,గళ్ళా రామచంద్రరావు పాల్గొన్నారు.అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకాంబరీ దేవి ఉత్సవాలు ప్రకృతి వైభవం, పంటల సమృద్ధి, ప్రజల శ్రేయస్సుకు ప్రతీకగా నిర్వహించబడుతున్నాయని, అమ్మవారి సేవలో ప్రత్యక్షంగా పాల్గొనడం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని తెలిపారు.రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పంటలతో కళకళలాడాలని భ్రమరాంబ అమ్మవారిని ప్రార్థించారు.



# గురుపౌర్ణమి సందర్భంగా గోరంట్లలో ఘనంగా ప్రత్యేక పూజలు

గుంటూరు జూలై 29 (మనం న్యూస్ ప్రతినిధి)ః స్థానిక గుంటూరు నగర పరిధిలోని గోరంట్లలో వెలసిన శ్రీ విజయ సాయిబాబా మందిరంలో నేడు గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో సమావేశమై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్, హాజరయ్యారు.దేవస్థానం చైర్మన్, దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, గోరంట్ల మాజీ సర్పంచ్ శ్రీ ఎర్రంశెట్టి వేణుగోపాల్, ఆధ్వర్యంలో దేవస్థానం కమిటీ సభ్యులు కలిసి గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి తులసి ధర్మచరణ్ గారు మాట్లాడుతూ, 'గురు వెలుగే జీవన దీపం, భక్తి మార్గమే శాశ్వత సత్యం. సాయిబాబా కృపతో మనసు ప్రశాంతం చెందుతుంది, గురుపౌర్ణమి శుభం సదా నిలిచే



జ్ఞానాన్ని అందిస్తుంది' అని కొనియాడారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, హారతులు, భజనలతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణం తో నింపారు. ఈ సందర్భంగా గురు మార్గదర్శకత్వం,సాయిబాబా ఆశీస్సులు, భక్తుల సమైక్యత ప్రధానాంశాలుగా నిలిచాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం, సత్సంగాలు, ధ్యాన కార్యక్రమాలను ఏర్పాటు చేసి, గురుపౌర్ణమి యొక్క ఆధ్యాత్మిక ప్రాధాన్యతను మరింతగా ప్రతిఫలింపజేశారు .ఈ కార్యక్రమంలో.చిల్లర శ్రీనివాసరావు,తాళ్ల శ్రీను, పాలపాటి సాయి,గుడి సతీష్ కుమార్,తెలప్రోలు వెంకట్రావు, తోట రంగారావు,గాజుల సాయిరాం,వెలగ సురేష్, మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# మొదటి త్రైమాసికంలో రికార్డు స్థాయి రిటైల్ అమ్మకాలు నమోదు చేసిన జేఎల్ఆర్ ఇండియా

విజయవాడ,జులై,29,(మనం న్యూస్)ః కార్ల అమ్మకాల్లో జేఎల్ఆర్ ఇండియా సంచలన రికార్డులు నమోదు చేస్తూనే ఉంది. తాజాగా రికార్డు స్థాయిలో అత్యంత బలమైన మొదటి త్రైమాసిక రిటైల్ అమ్మకాల పనితీరును నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 27 మొదటి త్రైమాసికంలో 1,665 యూనిట్లను విక్రయించింది. ఇది గతేడాదితో పోలిస్తే (వై ఓ వై) 11 శాతం అధికం. ఈ త్రైమాసికంలో హోల్సేల్ అమ్మకాలు 1,694 యూనిట్లుగా నమోదయ్యాయి, ఇది గతేడాదితో పోలిస్తే 4 శాతం అధికం. ఆర్థిక సంవత్సరం 27 మొదటి త్రైమాసికంలో మొత్తం రిటైల్ అమ్మకాలలో 85 శాతం పైగా రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ మరియు డిఫెండర్ మోడళ్లే ఉన్నాయి. ఇది భారతదేశ లగ్జరీ ఎస్ యువి విభాగంలో వాటి బలాన్ని స్పష్టం చేస్తుంది. డిఫెండర్ కంపెనీ యొక్క అత్యధికంగా అమ్ముడైన మోడల్గా నిలిచింది, ఇది భారతదేశంలో దాని 'టఫ్ లగ్జరీ' ప్రతిపాదనకు కొనసాగుతున్న ఆదరణను తెలియజేస్తుంది. ఇక ఈ త్రైమాసికంలో, జేఎల్ఆర్ ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్ టీ ఏ ) కింద రేంజ్ రోవర్ ఎస్.వి మరియు రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్.వి మోడళ్లకు సవరించిన ధరలను ప్రవేశపెట్టింది. మోడల్ను బట్టి రూ. 75 లక్షల వరకు ప్రయోజనాలు లభించాయి. ఈ ప్రకటన వినియోగదారుల్లో ఆసక్తికి పెంచింది. ముఖ్యంగా ఎస్.వి కు సంబందించి అన్ని విషయాలు తెలుసుకునేందుకు గణనీయంగా విచారణలు పెరిగాయి. రెండు మోడళ్లలోనూ బెస్పోక్ కమిషన్లకు డిమాండ్ పెరుగుతోందని జెఎల్ఆర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజన్ అంబా తెలిపారు. అత్యుత్తమ క్యూ1 రిటైల్ పనితీరుతో టాము ఎఫ్ వై 27ను బలంగా ప్రారంభించాం అన్నారు. రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్ మరియు డిఫెండర్లకు డిమాండ్ పెరుగుతూనే ఉందన్నారు. ఇండియా యూకే ఎఫ్టీఏ తర్వాత ఎస్ వీ మరియు బెస్పోక్లపై ఆసక్తి పెరగడాన్ని గమనిస్తున్నామన్నారు. భారతదేశంలో లగ్జరీ ఆటోమోటివ్కు ఇది ఒక కీలకమైన ఘట్టంగా మేము ఎఫ్టీఏను స్వాగతిస్తున్నామని చెప్పారు.

# వైభవంగా ఆషాఢ పౌర్ణమి గిరి ప్రదక్షిణ



**▶▶ వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**విజయవాడ ఇంద్రకీలాద్రి, జూలై 29 (మనం న్యూస్):** ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ బుధవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఘాట్రోడ్డు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.గిరి ప్రదక్షిణకు ముందు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.సంప్రదాయ తప్పెట్లు, కోలాటం, భజన బృందాల ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య గిరి ప్రదక్షిణ ఘనంగా సాగింది. ఘాట్రోడ్డు, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంది.మార్గమధ్యంలో మహిళలు పసుపు నీళ్లతో రహదారులను శుద్ధి చేసి హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు సమర్పిస్తూ జయజయధ్వానాలతో స్వామివారికి స్వాగతం పలికారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు దేవస్థానం తరఫున కుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆర్. శ్రీనివాసశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావుతో పాటు దేవస్థానం అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.



# ఇంద్రకీలాద్రిపై వైభవంగా ముగిసిన శాకంభరీ ఉత్సవాలు



**▶▶ మహాపూర్ణాహుతితో సమాప్తి..**

**▶▶ 45 టన్నుల కూరగాయలు, పండ్లతో అమ్మవారి అలంకరణ**



**విజయవాడ, ఇంద్రకీలాద్రి జూలై 29 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన శాకంభరీ ఉత్సవాలు బుధవారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. గురుపౌర్ణమి సందర్భంగా అమ్మవారు శాకంభరీ దేవి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. మొత్తం 45 టన్నుల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్తో గర్భగుడి, ఉపాలయాలు, ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులు, వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో మహాపూర్ణాహుతి, కలశోద్వాసనం, మార్జనం, ప్రోక్షణ కార్యక్రమాలు వైదిక సంప్రదాయాల ప్రకారం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ మాట్లాడుతూ రైతులు, దాతలు అందించిన విరాళాలతో 45 టన్నుల కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ అమ్మవారిని విశేషంగా అలంకరించామని తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు.మూడు రోజుల ఉత్సవాల్లో సుమారు 2.5 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఉత్సవాల్లో సమర్పించిన కూరగాయలతో తయారు చేసిన పవిత్ర 'కదంబం' ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గిరి ప్రదక్షిణలో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు, ఏఈఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో టూరిజం ప్రాజెక్టులు డీపీఆర్లకే పరిమితం కాకుండా గ్రౌండింగ్ కావాలి

**రూ.75 కోట్లతో ఏఎంసీ ఎంటర్టైన్మెంట్ ప్రాజెక్టును జూలై-2027 నాటికి అందుబాటులోకి తీసుకురావాలి**
**నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో 'విజయవాడ ఉత్సవ్' నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి**
**ఇబ్రహీంపట్నం పవిత్ర సంఘం వద్ద వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్తో ప్లాట్ఫాం నిర్మాణం చేపట్టాలి**
**పర్యాటక అభివృద్ధితో జిల్లా ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుంది**
**జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ**

**విజయవాడ: జూలై 29,(మనం న్యూస్):** జిల్లాలో ప్రతిపాదించిన పర్యాటక ప్రాజెక్టులు డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్టుల (డీపీఆర్) దశలోనే నిలిచిపోకుండా వేగవంతంగా గ్రౌండింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాకు ఆర్థికంగా, ఉపాధి పరంగా విశేష ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో గురువారం జిల్లా పర్యాటక ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భవానీ ఐలాండ్ వద్ద రూ.75 కోట్ల అంచనా వ్యయంతో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఏఎంసీ ఎంటర్టైన్మెంట్ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పొందాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డెస్టినేషన్ వెడ్డింగ్, వాటర్ స్పోర్ట్స్, బోటింగ్, 500 మంది సామర్థ్యంతో కన్వెన్షన్ హాల్ తదితర ఆధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జూలై-2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవానీ ఐలాండ్లో అమరావతి బోటింగ్ క్లబ్ను పర్యాటకులకు ఆకర్షణీయంగా, భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. బోటింగ్ కార్యకలాపాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. స్వరాజ్ మైదానంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో 75 మంది సామర్థ్యంతో మినీ థియేటర్ను పాఠశాల, కళాశాల విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక, అవగాహన చిత్రాల ప్రదర్శనకు వినియోగించాలన్నారు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంఘం వద్ద నదీహారతి కార్యక్రమాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వైదిక కమిటీ సూచనల మేరకు 30 డిగ్రీల డైమెన్షన్లో ప్రత్యేక ప్లాట్ఫాంను నిర్మించాలని ఆదేశించారు. అలాగే భక్తులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేయాలని కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాకపోకలకు అనుగుణంగా రోడ్డు అభివృద్ధికి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్ అండ్ బి అధికారులు తయారు చేయాలని సూచించారు. నదిహారతి సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నందున సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల మధ్య ఆర్టీసీ బస్సులను ఆ రూట్ లో నడపాలని సూచించారు. విద్యుత్ కేబుల్స్ ఏర్పాటుకు జల వనరుల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది విజయవంతంగా నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా నవరాత్రుల సందర్భంగా పున్నమి ఘాట్, ఫెర్రీ ఘాట్, బసవ పున్నయ్య స్టేడియంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. జిల్లాలో పర్యాటక ఆకర్షణగా ఉన్న సిబార్ డిస్నీల్యాండ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టి తిరిగి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ప్రసాద్' పథకం ద్వారా లభించే నిధులను జిల్లాలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధికి వినియోగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొండపల్లి ఖిల్లాను అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ట్రెక్కింగ్, ర్యాపెల్లింగ్ వంటి సాహస క్రీడలకు అవసరమైన బేస్ క్యాంపును ఆగస్టు 7 నుండి 11 వరకు ఏర్పాటు చేయడంతో పాటు, శాశ్వత టికెటింగ్ కౌంటర్ను ఏర్పాటు చేసి ట్రెక్కింగ్కు అవసరమైన సామగ్రిని పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటక రంగంలో సమన్వయంతో ముందుకు సాగాలి జిల్లాలో ప్రతిపాదించిన ప్రతి పర్యాటక ప్రాజెక్టు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ స్పష్టం చేశారు. పర్యాటక అభివృద్ధి ద్వారా జిల్లాకు మరింత ఆదాయం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విజయవాడను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వై.వి. ప్రసన్నలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎ.శిల్ప, జిల్లా అటవీశాఖ అధికారి ఏ.సతీష్, ఏపీటీడీసీ ఈఈ జి.శ్రీనివాసరావు, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం ఏఈఓ ఎన్.రమేష్, ఏఈ రమ, అమరావతి బోటింగ్ ప్రాజెక్ట్ సీఈవో కాకాని తరుణ్, బీఐటీసీ ప్రాజెక్టు ఇంజనీర్ జి.ఉమామహేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.





# జిల్లా ఆర్థికాభివద్ధికి జివిఏ-జిడిడిపిపై సమగ్ర అవగాహన అవసరం

**స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాలకు నాణ్యమైన గణాంకాలే పునాది**
**మండల స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు జివిఏ-జిడిడిపిపై అవగాహన పెంపొందించాలి**
**శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించాలి**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

**విజయవాడ: జూలై 29,(మనం ప్రతినిధి):** జిల్లా ఆర్థికాభివద్ధి వేగవంతం కావాలంటే స్థూల విలువ జోడింపు, స్థూల జిల్లా దేశీయోత్పత్తి వంటి ఆర్థిక సూచికలపై ప్రతి శాఖకు సమగ్ర అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ శిక్షణలో జిల్లా ఆర్థికాభివద్ధి, జివిఏ, జిడిడిపి, రంగాల వారీ ఆర్థిక వద్ధి, జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక గణాంకాల తయారీ, విశ్లేషణ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లైన మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్,యంగ్ ప్రొఫెషనల్స్కు సమగ్ర అవగాహన కల్పించారు. 2025-26 సంవత్సరానికి జిల్లా జిడిడిపి సుమారు రూ.1,05,135 కోట్లుగా నమోదైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా అభివద్ధి ప్రగతిని అంచనా వేయడంలో జివిఏ, జిడిడిపి వంటి ఆర్థిక సూచికలు కీలకమని పేర్కొన్నారు. ప్రతి శాఖ జివిఏ లెక్కింపు విధానాలు, రంగాల వారీ వద్ధి, గణాంకాల వినియోగంపై పూర్తి అవగాహనతో పనిచేయాలని సూచించారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే నూరు శాతం అక్షరాస్యత సాధించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు నైపుణ్యాభివద్ధికి ప్రాధాన్యత కల్పిస్తే దాదాపు 95 శాతం ప్రజలను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు సంపూర్ణ నైపుణ్యాలను సొంతం చేసుకున్నప్పుడే కుటుంబాలతో పాటు రాష్ట్ర, దేశ ఆర్థికాభివద్ధికి బలమైన ఆధారంగా నిలుస్తారని తెలిపారు. నైపుణ్య విద్య ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వివరించారు. వ్యవసాయ రంగంలో సంప్రదాయ పంటలతో పాటు విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వరి సాగులోని కొంత భూమిని ఉద్యానవన పంటలకు మళ్లించడం ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. విజయవాడ ఉత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సేవారంగంలో సుమారు రూ.150 కోట్ల అదనపు స్థూల విలువ జోడింపును సాధించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివద్ధితో సేవారంగం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని సహజ, మానవ వనరులు, భౌగోళిక అనుకూలతలను సమర్థవంతంగా వినియోగించుకొని అభివద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంలో ఉత్పత్తి పెంపుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై దష్టి పెట్టాలని, సేవా, పారిశ్రామిక రంగాల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం సైద్ధాంతిక అంశాలకు పరిమితం చేయకుండా పరస్పర చర్చలు, ప్రశ్నోత్తరాలు, ఆచరణాత్మక ఉదాహరణలతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మండల స్థాయి అధికారులు, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు సిబ్బందికి సమర్థవంతంగా చేరవేయాలని ఆదేశించారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించి జివిఏ, జీఎస్డీపీ, జిడిడిపి, జీఎస్డీపీ వంటి ఆర్థిక భావనలపై క్షేత్రస్థాయి వరకు అవగాహన కల్పించాలని తెలిపారు. అభివద్ధి ప్రణాళికల అమలులో భాగస్వాములైన ప్రతి స్థాయి అధికారి, సిబ్బందికి ఈ అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానం ఉండటం అవసరమని పేర్కొన్నారు. జిల్లా ఆర్థికాభివద్ధికి సంబంధించిన గణాంకాల సేకరణ, విశ్లేషణ, వినియోగంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివద్ధి ప్రణాళికలను రూపొందించి సమిష్టి కషితో జిల్లా అభివద్ధిని మరింత వేగవంతం చేసి స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.అనుపమ మాట్లాడుతూ, ప్రతి శాఖ తన పరిధిలోని గణాంక సమాచారాన్ని ఖచ్చితత్వంతో, పారదర్శకతతో, నిర్ణీత గడువులో అందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి విశ్వసనీయ గణాంకాల ఆధారంగా అభివద్ధి ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాల సాధనలో నాణ్యమైన, విశ్వసనీయ, సమయానుకూల గణాంకాలే విజయానికి పునాది అని పేర్కొన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలలో రంగాల వారీ జివిఏ పురోగతిని కీలక పనితీరు సూచికల ద్వారా నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చోట సకాలంలో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పహాలే ఇండియా ఫౌండేషన్ శిక్షకులు జె.అనిల్ కుమార్, బెల్లపు రాగిణి, జోనల్ కోఆర్డినేటర్ యోగేష్ కష్ణ, జిల్లా విశ్లేషకులు, మండల స్థాయి అధికారులు, సీపీఏపీ యూనిట్ సభ్యులు, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.







# క్రీడలతో ఆరోగ్యం పదిలం

- క్రీడలు మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదం చేస్తాయి
- ఉద్యోగులు ప్రతిరోజూ ఏదో ఒక క్రీడకు సమయం కేటాయించాలి
- కలెక్టరేట్ ఇగ్నైట్ సెల్లో క్రీడా పరికరాల ప్రదర్శనను సందర్శించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

**(విజయవాడ,మనం బ్యూరో):** క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతిరోజూ కొంత సమయాన్ని ఏదో ఒక క్రీడకు కేటాయించాలని ఆయన సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్ను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన క్రీడా పరికరాల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని ఇండోర్ క్రీడలను స్వయంగా ఆడి సిబ్బందిని, సందర్శకులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఆదాయ వనరులను పెంపొందించే ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు ప్రోత్సాహం కల్పించడం, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా జిల్లాలో సమగ్ర అభివృద్ధికి దోహదపడే సమాచార వేదికగా ఇగ్నైట్ సెల్ పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' అనే లక్ష్యంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి శాఖ సేవలను ప్రజలకు చేరువ చేసే సమాచార వేదిక ఇగ్నైట్ సెల్ ద్వారా ప్రతిరోజూ ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించిన సేవలు, పథకాలు, కార్యక్రమాలు, ఆ శాఖ రూపొందించిన ఉత్పత్తులు, ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని ప్రదర్శన రూపంలో అందుబాటులో ఉంచుతున్నామని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల ప్రజలకు ప్రభుత్వ శాఖల పనితీరు, అవకాశాలు, సేవలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందన్నారు. ఈరోజు జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడా పరికరాలు, క్రీడలకు సంబంధించిన సమాచారాన్ని ప్రత్యేకంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడా శాఖ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధించిన విజయాలు, వారికి లభిస్తున్న ప్రోత్సాహకాలు వంటి అంశాలను ప్రదర్శనలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని కలెక్టర్ అన్నారు. ప్రతి ఉద్యోగి, ప్రతి విద్యార్థి తమ దైనందిన జీవితంలో క్రీడలను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, ఉత్సాహభరితమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి కె.కోటేశ్వరరావు, క్రీడా శిక్షకులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ వేదికగా నందిగామ అభివృద్ధికి మరో ముందడుగు..



- **ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్తో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భేటీ**
- **నియోజకవర్గ ప్రధాన సమస్యలు, అభివృద్ధి పనులపై కీలక చర్చలు**

**న్యూఢిల్లీ,జులై29(మనం న్యూస్):** నందిగామ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, ప్రజా ప్రతినిధులతో కలిసి సమావేశమైన ఎమ్మెల్యే తంగిరాలసౌమ్య. నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో భేటీ అయి నందిగామ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, పెండింగ్ అంశాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సవివరంగా చర్చించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ప్రతి అంశానికి పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుల సమన్వయంతో నందిగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ స్థాయిలోనూ నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, ప్రజా ప్రతినిధులు, మంత్రులతో సమన్వయం చేసుకుంటూ మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య),మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరి అలంకారంలో దర్శనమిచ్చిన పెరికీడు గంగానమ్మ తల్లి

**హనుమాన్ జంక్షన్: జూలై 29 ( మనం న్యూస్):** బాపులపాడు మండలం పెరికీడు గ్రామ దేవత శ్రీ గంగానమ్మతల్లి కి ఆషాఢ పౌర్ణమి సందర్భంగా కాయగూరలు తో ' శాకాంబరీ అలంకారం ' కార్యక్రమం చాలా వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నక్కా బాబు,నండూరి సత్య వెంకటేశ్వరశర్మ,పుట్టి కోటేశ్వరరావు, పుట్టి రాంబాబు, మెరుగుమాల వేణు,వంశీ,తేజ రాజులపాటి శ్రీనివాసరావు ,జెట్టి సీతమ్మ,తదితరులు పాల్గొన్నారు.





# అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

**ఇంటింటికి టిడిపిఇంటింటికి సంక్షేమం కార్యక్రమంలోఎమ్మెల్యే శ్రీ రాం రాజగోపాల్ (తాతయ్య)**



**జగ్గయ్యపేట, జూలై 29: మనం న్యూస్ః** రాష్ట్రంలోని ప్రతి అర్హ త కలిగిన కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికి టీడీపీ - ఇంటింటికి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ముందుగా అన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలవాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా రాష్ట్ర ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడిందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు లక్ష్యాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనాసాగరం ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం, వ్యక్తి మృతి

**నందిగామ,జులై29(మనం న్యూస్)ః**ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనాసాగరం గ్రామం లో ఫ్లైఓవర్ వద్ద రోడ్డు ప్రమాదంలో యర్రగుంట్ల త్రినేష్(35) వ్యక్తి మృతి చెందాడు. మృతుడు పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు నందిగామ పట్టణంలో రైతు పేట లో నివాసం ఉన్నట్లుగా సమాచారం. నవాబుపేట నుండి నందిగామ వస్తుండగా అనాసాగరం ఫ్లైఓవర్ వద్ద బైక్ పై కిందపడి మృతి చెందినట్లుగా స్థానిక ప్రజలు తెలిపారు.ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా, సెల్ఫ్ యాక్సిడెంట్ అయ్యి మృతి చెందాడ అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని నందిగామ మార్చరీకి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు పోలీసుల సమక్షంలో అప్పగించారు. సాయంత్రం 4:00 ల నుండి నవాబుపేటలో అంత్యక్రియల కార్యక్రమం కుటుంబ సభ్యులు నిర్వహించారు.

# ఎన్టీఆర్ జిల్లా ఐ.టి.ఐ లలో రెండవ విడత అడ్మిషన్లు

**జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు**

**విజయవాడ, జూలై, 29,(మనం న్యూస్)ః** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని ఐ.టి.ఐ లలో 2026-27/28 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ ఎం. కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ లోగా ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 6వ తేదీన విజయవాడలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో అడ్మిషన్ల కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ ఆధారంగా నిర్ణీత తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్కు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఐ.టి.ఐ లలో ప్రవేశం పొందే వారిలో ఎస్.సి., ఎస్.టి. అభ్యర్థులు మినహా మిగిలిన కేటగిరీల అభ్యర్థులు రూ. 60/- కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ప్రైవేటు ఐ.టి.ఐ లలో చేరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు తమ మెరిట్ నంబర్ సమాచారం కోసం విజయవాడ ప్రభుత్వ ఐ.టి.ఐ లోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ను సంప్రదించవచ్చునన్నారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, లేదా 77804 29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కన్వీనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి బలం



**20వ డివిజన్లో ఇంటింటి ప్రచారంలో గద్దె క్రాంతి కుమార్**

**విజయవాడ తూర్పు, జూలై 29( మనం న్యూస్)ః** ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలమని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం 20వ డివిజన్ కృష్ణలంకలోని గల్లా కామేశ్వరరావు రోడ్డులో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిసి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 'రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమం-నమ్మకం' పేరుతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళల ఆర్థిక సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇంటింటి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు గల్లా శ్రీను, చింతా వెంకటేశ్వరరావు, కొడాలి సాయిబాబు, వన్నెంరెడ్డి రాధ, గల్లా సుబ్బారావుతో పాటు బూత్, క్లస్టర్ ఇన్చార్జీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ**

**గుంటూరు, జూలై 29:( మనం న్యూస్ ప్రతినిధి)ః** రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రాజధాని ప్రాంతంలోని పెరేడ్ గ్రౌండ్స్లో నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లను, అధికారులకు కేటాయించాల్సిన బాధ్యతలను సమీక్షించారు. వేడుకలకు రాష్ట్రస్థాయి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు,ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. వేదిక, పరేడ్,సీటింగ్, బారికేడింగ్, విద్యుత్,తాగునీరు, పారిశుద్ధ్యం,వైద్య సదుపాయాలు,పార్కింగ్ తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖలు సమన్వయంతో చేపట్టాలన్నారు.అదేవిధంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ,వాహనాల పార్కింగ్,అత్యవసర సేవలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరేడ్లో పాల్గొనే పోలీసు, ఎన్సీసీ,విద్యార్థులు, ఇతర బృందాలకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని,కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్ఓ ఖాజావలి, ఆర్ డి ఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఇంటింటికి తెలుగుదేశం.. ప్రజలతో మమేకం బోండా సిద్ధార్థ



**విజయవాడ, సెంట్రల్ జూలై 29: (మనం న్యూస్)ః** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్ సుందరయ్యనగర్లో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అన్న నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద నుంచి యువనేత బొండా సిద్ధార్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు బొండా సిద్ధార్థ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజలకు నేరుగా వివరించేందుకే 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వంలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలను స్వీకరించి త్వరితగతిన పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.పేద కుటుంబాలకు సొంత నిధులతో పెన్షన్లు, కుట్టు మిషన్లు, ఇస్త్రీ బండ్లు, తోపుడు బండ్లు, విద్యార్థులకు విద్యా సహాయం తదితర జీవనోపాధి పరికరాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ప్రజల మధ్యే ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేస్తామని బొండా సిద్ధార్థ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మోదుగుల తిరుపతమ్మ, పైడి తులసి, డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, కోలా శ్రీను, మోత్కూరి కాసిం, దుర్గాసి రాము తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు పెద్ద భరోసా



- అర్హులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ సెంట్రల్, జూలై 29( మనం న్యూస్):** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక అండగా నిలుస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సింగ్నగర్లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సకు దూరం కాకుండా అవసరమైన సమయంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో సహాయం అందిస్తోందని చెప్పారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రభుత్వమే అండగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు .సీఎంఆర్ఎఫ్ సహాయం అవసరమైన వారు ప్రజాప్రతినిధులు, అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి వేగంగా సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో 64వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె. రవికుమార్, కార్యాలయ ఇన్చార్జి ఘంటా కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. బాబు, కోమరి రాజేష్, కంకణాల బాబు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



**ఉయ్యూరు, జూలై 28 (మనం న్యూస్):** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ 9వ వార్డులో మంగళవారం నిర్వహించిన 'డోర్ టు డోర్' కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్తో కలిసి ఆయన పాల్గొన్నారు. టౌన్ పార్టీ అధ్యక్షుడు జంపాన గురునాధరావు, క్లస్టర్ ఇన్చార్జి వాసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, దేశంలోనే ఆదర్శంగా నిలిచే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు వల్లభనేని సత్యనారాయణ, జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ కుదూస్, తెలుగుదేశం నాయకులు జంపాన వీర శ్రీనివాస్, సయ్యద్ అజ్మతుల్లా, రాజులపాటి ఫణి, వార్డు అధ్యక్షుడు సుంకర అయ్యప్ప, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డు కమిషనర్కు పీడీఎస్యూ వినతి




**విజయవాడ సెంట్రల్ జూలై 28 (మనం న్యూస్ )** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న స్పెషల్ ఫీజులను తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా బోర్డు కమిషనర్ పి. రంజిత్ బాషా (ఐఏఎస్)కు సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పీడీఎస్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లక్షకు పైగా పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. సైన్స్ కోర్సు విద్యార్థుల నుంచి రూ.2,956, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల నుంచి రూ.1,694, ఆరట్స్ కోర్సులకు రూ.1,150, ఒకేషనల్ కోర్సులకు రూ.1,996 చొప్పున స్పెషల్ ఫీజులు వసూలు చేయడం విద్యార్థులపై అదనపు భారం మోపినట్లేనని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆయన కోరారు.వినతిపత్రం సమర్పించిన వారిలో పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. మహర్షి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఐ. రాజేష్, కె. నాని తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి తెలుగుదేశం.. ప్రజల సమస్యలపై దృష్టి బొండా రవితేజ



**విజయవాడ, సెంట్రల్ జూలై 29 (మనం న్యూస్):** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 29వ డివిజన్ మధురానగర్ ఇందిరా కాలనీలో బుధవారం 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. రామాలయం వద్ద నుంచి యువనేత బొండా రవితేజ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ స్థానికుల సమస్యలు, అవసరాలు, సూచనలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ, 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతోందన్నారు. ప్రజల సహకారం, విశ్వాసంతోనే అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నాయకత్వంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తోందని తెలిపారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సొంత నిధులతో జీవనోపాధి పరికరాలు, విద్యా సహాయం, వైద్య సహాయం అందిస్తూ అనేక కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజల ఆశయాలను తెలుసుకుని, అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని బొండా రవితేజ తెలిపారు.

# ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదు

- ప్రతిభావంతులైన 118 మంది విద్యార్థులకు రూ.6.20 లక్షల నగదు ప్రోత్సాహకాలు
- మూలపాడులో బ్రేక్ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు



**ఇబ్రహీంపట్నం, జూలై 29, (మనం న్యూస్):** ప్రతిభకు పేదరికం ఎన్నటికీ అడ్డంకి కాకూడదని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు అటవీశాఖ నగరవనంలో బుధవారం నిర్వహించిన 'బ్రేక్ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గంలోని 35 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 118 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు మొత్తం రూ.6.20 లక్షల నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలపై ఆత్మీయంగా ముచ్చటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని, 'నో వేకెన్సీ' బోర్డులు కనిపించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు ఎదగడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు, తల్లికి



వందనం వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రతి ఏడాది ఇదే తరహాలో ప్రోత్సహిస్తామని వెల్లడించారు. మూలపాడు నగరవనాన్ని విద్యార్థులు తరచూ సందర్శించి ప్రకృతితో మమేకమవడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునివ్వగా, విద్యార్థులు నగరవనంలోని సీతాకోకచిలుకల పార్కులో ప్లాస్టిక్ బాటిళ్లను స్వచ్ఛందంగా ఏరి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు అన్న ఎన్టీఆర్ జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని, అలాగే భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం సూచించినట్లుగా గొప్ప కలలు కని వాటిని సాకారం చేసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



**విజయవాడ, జూలై 29:** గురుపౌర్ణమి సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు షిర్డీ సాయిబాబా ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ వివిధ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాత్మాగాంధీ హోల్సేల్ కమర్షియల్ కాంప్లెక్స్లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు, కార్యదర్శి కాసుల వెంకటనారాయణ పాల్గొన్నారు.చెరువు సెంటర్లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, దుర్గారావు, జనసేన నాయకులు గంజి పవన్, లింగం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పూర్ణానందంపేటలోని శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో శ్రీ షిర్డీ సాయి సత్సంగ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.ఎస్. బేగ్, ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ నాయకుడు సారేపల్లి రాధాకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కొత్తపేటలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో కూడా ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యమైన తాగునీటి సరఫరాపై దృష్టి



**వాంబే కాలనీ డబ్ల్యూటీపీ పనులకు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన బొండా ఉమా**

విజయవాడ, సెంట్రల్ జూలై 29 (మనం న్యూస్)ః ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీటిని అందించే లక్ష్యంతో వాంబే కాలనీ సమీపంలో ప్రతిపాదించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం వాటర్ సప్లై విభాగం అధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్లాంట్ నిర్మాణానికి అనుకూల పరిస్థితులు, స్థల విస్తీర్ణం, నీటి వనరుల లభ్యత, పైప్లైన్ అనుసంధానం, విద్యుత్ సౌకర్యం, రాకపోకల మార్గాలు, భవిష్యత్తు విస్తరణ అవకాశాలను పరిశీలించారు. ప్రాజెక్టు అమలులో సాంకేతిక, పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వాటర్ సప్లై విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రాజెక్టు అంచనా వ్యయం, నిర్మాణ దశలు, అవలు కాలపట్టిక, నీటి శుద్ధి సామర్థ్యం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రణాళికను ఎమ్మెల్యేకు వివరించారు.ఈ సందర్భంగా బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డబ్ల్యూటీపీ పూర్తయితే పరిసర ప్రాంతాల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రతి రూపాయి ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ సప్లై విభాగం అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వెలంపల్లి

**సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



విజయవాడ సెంట్రల్, జూలై 29 (మనం న్యూస్)ః గురుపౌర్ణమి సందర్భంగా విజయవాడలోని పలు షిర్డీ సాయిబాబా ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైఎస్సార్సీపీ ఇన్చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం పాల్గొన్నారు. సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమంలో భక్తులకు స్వయంగా ప్రసాదం వడ్డించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజున షిర్డీ సాయిబాబా దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. సాయిబాబా బోధించిన ప్రేమ, శాంతి, సహనం, సర్వధర్మ సమభావాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు. సాయిబాబా ఆశీస్సులతో విజయవాడ నగర ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. గొల్లపాలెం గట్టు, పూర్ణానందపేట, విద్యాధరపురం, గొల్లపూడి, బీసెంట్ రోడ్, ముత్యాలంపాడు ప్రాంతాల్లోని షిర్డీ సాయిబాబా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చిట్టినగర్లో గురు దత్త సాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ గౌతమ్ రెడ్డి శ్రీహరి ఆలయ నిర్వాహకులు, భక్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 35వ డివిజన్లో ఇంటింటి తెలుగుదేశం ప్రచారంలో ప్రజల నుంచి సూచనలు స్వీకరణ మల్లెల ఈశ్వరరావు



విజయవాడ, పశ్చిమ జూలై 29 (మనం న్యూస్)ః కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అవలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం బుధవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 35వ డివిజన్లోని దేవి స్ట్రీట్లో నిర్వహించారు. 239వ బూత్ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి సమస్యలు, సలహాలు, సూచనలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ద వెంకన్న సూచనల మేరకు 35వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు బోదాల నందకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి కొట్టేటి హనుమంతరావు, సెక్రటరీ అరవ పెరుమాళ్, వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకురాలు పైడిమల సుభాషిణి, బూత్ కన్వీనర్ కొదమల్ రాజు, కర్రి సునీత, ఇత్తడి చార్లిస్, శ్రీరామ్, లలిత, యూనిట్ ఇన్చార్జి కొట్టేటి సరిత, ఆసిఫ్ పటాన్, మౌనిక, దీప్తి, రాజ్యలక్ష్మి, సుహాసిని, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



**వినతులు స్వీకరించి అధికారులతో సమస్యల పరిష్కారానికి చర్యలు**

విజయవాడ, పశ్చిమ జూలై 29 (మనం న్యూస్)ః ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్రజా దర్బార్'కు విశేష స్పందన లభిస్తోంది. ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినిపించారు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నాయకులు ఆకారపు విజయకుమారి, బీ. జోగేశ్వరరావు, కూర్మారావు, దేవిన హరిప్రసాద్, దుర్గేసుల హుస్సేన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లు, వైద్య సహాయం, రేషన్ కార్డులు, స్థానిక సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా అందాయి. వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి వారి సమస్యలకు సత్వర పరిష్కారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు కూటమి నాయకులు పేర్కొన్నారు.ల

# సీపీఎం కేంద్ర కార్యాలయంపై పోలీసుల చర్యను ఖండిస్తూ నిరసన విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్



విజయవాడ సెంట్రల్, జూలై 29 (మనం న్యూస్)ః ఢిల్లీలో సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు ప్రవేశించడం, విద్యార్థి నాయకురాలు ఐషి ఘోష్ను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడాన్ని నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ బీసెంట్ రోడ్డులోని మహతి మార్కెట్ వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థి నాయకులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సిహెచ్ బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆందోళనకారులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేసే చర్యలను నిలిపివేయాలని, విద్యార్థులపై నమోదైన కేసులను భేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలు, నూతన విద్యా విధానంపై ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ధర్నాలో సీపీఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు, తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవి అమ్మవారిని దర్శించుకున్న బొండా ఉమా



విజయవాడ, సెంట్రల్ జూలై 29 (మనం న్యూస్)ః గురుపౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సత్యనారాయణపురం జి.ఎస్. రాజు రోడ్డులో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న శాఖాంబరి ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు బుధవారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ గురుపౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువులను స్మరించుకునే పవిత్రమైన పర్వదినమని అన్నారు. గురువుల ఆశీస్సులు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకమని, రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఆషాఢ మాసంలో నిర్వహించే శాఖాంబరి ఉత్సవాలకు విశిష్ట ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని, అమ్మవారి అనుగ్రహంతో విజయవాడ నగరం, సెంట్రల్ నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తుమ్మలపెంట శ్రీనివాసరావు, గార్లపాటి విజయ్కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.